



RNI NO.TGTEL/25/A5224

# జోర్దార్

JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక

అవినీతి అంతం - మా పంతం




కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 263 శనివారం, అక్టోబర్ 10 2026, పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

## మెమోతోనే మమ అనిపిస్తారా?

## హెడ్మాస్టర్‌పై కఠిన చర్యలు ఎప్పుడు?

**నిజామాబాద్ జోర్దార్ నిఘా విభాగం**

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం కమలాపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై వచ్చిన తీవ్ర ఆరోపణల నేపథ్యంలో కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. వారం రోజులపాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించలేదని, అయినప్పటికీ రికార్డుల్లో భోజనం పెట్టినట్లు నమోదు చేశారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ గత నెల 30న జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రధానోపాధ్యాయుడిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదులో మధ్యాహ్న భోజనం నిలిపివేయడంతో పాటు ఓపెన్ స్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించకపోవడం, పరీక్షల సమయంలో ఫీజులు వసూలు చేసి పరీక్షలకు అనుమతించలేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఫిర్యాదు కాపీలను కలెక్టర్, ప్రాంతీయ సంయుక్త సంచాలకులకు పంపినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు అనంతరం జాయింట్ కలెక్టర్ సురేష్ పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టినట్లు తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి 22 వరకు మధ్యాహ్న భోజనం వండించలేదని విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి విచారణలో వెల్లడైనట్లు ఆరోపించారు. అయితే భోజనం అందించినట్లు రికార్డుల్లో నమోదు చేసినట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు. విచారణ సమయంలో విద్యార్థులు, ముఖ్యంగా బాలికల పట్ల ప్రధానోపాధ్యాయుడు అసభ్యంగా మాట్లాడుతున్నారని చెప్పినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనాల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఈ నెల 3న నివేదిక సమర్పించినప్పటికీ, ఇప్పటివరకు కఠిన చర్యలు లేకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనికి బదులుగా ఈ నెల 5న ఆర్‌సీ నంబర్ 2972/బి1/2025 ద్వారా మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ప్రధానోపాధ్యాయుడికి మెమో




జారీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు భోజనం అందించకపోవడం, రికార్డుల్లో తప్పుడు వివరాలు నమోదు చేశారనే ఆరోపణలు, విద్యార్థుల పట్ల అనుచిత ప్రవర్తన వంటి అంశాలపై విచారణ నివేదికలు ఉన్న నేపథ్యంలో కేవలం సంజాయిషీ మెమోతోనే వ్యవహారాన్ని ముగిస్తారా? లేక సీసీఏ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమ పిల్లలకు ఇబ్బందులు కలిగిస్తున్న ప్రధానోపాధ్యాయుడిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## ‘సర్’ పై బీఆర్ఎస్ మౌనం.



**హైదరాబాద్, అక్టోబర్ 9:** బీఆర్ఎస్ నేతలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ‘సర్’ ఆందోళనలో బీఆర్ఎస్ ఎక్కడుందని ప్రశ్నించారు. సీఈసీ తప్పిదం చేస్తుంటే హరీశ్ రావు, కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని నిలదీశారు. నిరసన కార్యక్రమం ఎందుకు చేయడం లేదన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుందని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే ఈ-ఫార్ములా కేసులో అరెస్ట్ చేస్తారని, కాళేశ్వరం కేసులో సీబీఐ అరెస్ట్ చేస్తుందని భయమా అని ప్రశ్నించారు. ఉండటానికి ఇల్లు లేదన్న కేటీఆర్‌కు ఫైవ్‌స్టార్ హోటల్స్ ఎలా వచ్చాయని.. ఆయనకు ఇన్ని వేలకోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని నిలదీశారు. సర్’ ప్రక్రియపై దేశ వ్యాప్తంగా బీజేపీ, మిత్ర పక్షాలు తప్ప అన్ని పార్టీలు రోడ్డెక్కాయన్నారు.

## ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?



**హైదరాబాద్:** ఫలితాలు వ్యతిరేకిస్తే రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తుందని మండిపాటుకాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజా తీర్పును గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్న ట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బ తీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతిమయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

## ఏడాది దాటినా తిరిగి రాని డీసీఈబీ నిధులు..

## విద్యార్థుల సొమ్ముతో అధికారుల చెలగాటమా?

**-- రూ.6.50 లక్షల సంగతి అంతేనా..? మరో రూ.5 లక్షల మళ్లింపుపైనా విచారణకు డిమాండ్**

**హనుమకొండ జోర్దార్ నిఘా విభాగం**

హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) నిధుల వినియోగంపై తీవ్ర ఆరోపణలు వెలువడుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల నుంచి వసూలు చేసే పరీక్ష ఫీజులతో కూడిన డీసీఈబీ నిధులను పరీక్షల నిర్వహణకు సంబంధించిన అవసరాలకే వినియోగించాల్సి ఉండగా, ఇతర అవసరాలకు మళ్లించారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. గతంలో పనిచేసిన ఓ డీఈవో డీసీఈబీ ఖాతా నుంచి రూ. 6.50 లక్షలను కోర్టు కేసుకు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ మొత్తాన్ని తిరిగి డీసీఈబీ ఖాతాలో జమ చేస్తామని హామీ పత్రం ఇచ్చినప్పటికీ, ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు తిరిగి చెల్లించలేదని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. విద్యార్థుల పరీక్ష ఫీజులతో కూడిన నిధులను ఈ విధంగా మళ్లించడంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, గత ఏడాది సెప్టెంబర్‌లో బాసిన్‌నగర్ పాఠశాల భవన మరమ్మతులకు




సంబంధించిన బకాయిల విషయంలో భవన యజమాని కోర్టును ఆశ్రయించిన సమయంలో, డీఈవో కార్యాలయం జప్తు అవుతుందనే పరిస్థితుల్లో డీసీఈబీ నుంచి మరో రూ. 5 లక్షలు తీసుకుని కోర్టుకు చెల్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మొత్తాన్ని కూడా ఏడాది అవుతున్నా తిరిగి డీసీఈబీ ఖాతాలో జమ చేయలేదని ఆరోపిస్తున్నారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన పరీక్ష ఫీజుల నిధులు ఇతర అవసరాలకు మళ్లించబడ్డాయా? మళ్లిస్తే అందుకు అనుమతులు ఎవరు ఇచ్చారు? తీసుకున్న మొత్తాలను తిరిగి ఎందుకు జమ చేయలేదు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డీసీఈబీ నిధుల వినియోగంపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా హామీ పత్రం ఇచ్చి ఏడాది దాటినా తిరిగి జమ చేయని రూ. 6.50 లక్షలను వడ్డీతో సహా డీసీఈబీ ఖాతాలో జమ చేయించాలని, మరో రూ. 5 లక్షల వినియోగంపైనా పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరు తున్నారు. విద్యార్థుల పరీక్ష ఫీజులతో కూడిన నిధులను నిబం ధనలకు విరుద్ధంగా వినియోగించినట్లు తేలితే బాధ్యులైన అధికా రులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## సర్’పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి



**హైదరాబాద్:** హైదరాబాద్, అక్టోబర్9: ‘సర్’ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవి నుంచి తప్పుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎలక్షన్ కమిషన్‌పై మండిపడ్డారు. ‘వ్యక్తుల కంటే వ్యవస్థలే గొప్పవి. ఒక్క వ్యక్తిని కాపాడేందుకు ఇంత ఆరాటం ఎందుకు?.. భారత రాజ్యాంగం కంటే ఎవరూ గొప్పవారు కాదు. భారత పౌరుల ఓటుహక్కును హరించే అధికారం ఎవరికీ లేదు. 140 కోట్ల మంది భారతీయుల హక్కుల కంటే ఒక్క వ్యక్తి గొప్పవాడా?.. ఎలక్షన్ కమిషన్‌లో జరుగుతున్న అక్రమాలకు బాధ్యత వహించి.. జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి వైదొలగాలి. ‘సర్’ ప్రక్రియపై స్వతంత్ర దర్యాప్తునకు బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ‘సర్’ ప్రక్రియపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో లోతుగా విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం’ అని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఆదాయ పన్ను నిబంధనలను ఉల్లంఘించిన ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

- ఒకేసారి హెచ్‌ఆర్‌ఏ, గృహ రుణ వడ్డీ క్లెయిమ్
- సొంత ఇల్లు ఉండగా అద్దె ఇంటి అలవెన్స్ తీసుకుంటున్న వైనం

**జోర్దార్ ప్రతినిధిహన్మకొండ**

ఇంటి అద్దె భత్యం అక్రమంగా క్లెయిమ్

హన్మకొండలోని ఒక ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ ఆదాయ పన్ను నిబంధనలకు విరుద్ధంగా పన్ను మినహాయింపులు పొందుతున్నారని జోర్దార్ వార్తా సంస్థకు ఫిర్యాదు అందింది.

**నిబంధనల ఉల్లంఘన ఏమిటి?**

ఒక ఉద్యోగి సొంత ఇల్లు ఉన్న అదే నగరంలో అద్దె ఇంట్లో ఉంటూ హెచ్‌ఆర్‌ఏ క్లెయిమ్ చేయకూడదు. కానీ ఈ ప్రిన్సిపాల్ కుమార్‌పల్లి, హన్మకొండలోనే సొంత ఇల్లు ఉండగా, అద్దె ఇంట్లో ఉన్నట్లు చూపి హెచ్‌ఆర్‌ఏ కింద రూ. 1,14,915 క్లెయిమ్ చేశారు. అదే సమయంలో అదే ఇంటిపై గృహ రుణ వడ్డీ కింద రూ. 3,50,000 కూడా క్లెయిమ్ చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒకే ఇంటిపై ఒకేసారి రెండు లబ్ధిలు పొందడం ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 10(13ఏ) ప్రకారం నిబంధనల ఉల్లంఘనగా ఫిర్యాదుదారు ఆరోపించారు.




**80ఈఈఏ నిబంధనల ఉల్లంఘన:**

అంతేకాకుండా రూ. 68 లక్షల గృహ రుణంపై 80ఈఈఏ కింద అదనపు మినహాయింపు కూడా క్లెయిమ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రూ. 45 లక్షల కంటే తక్కువ విలువైన ఇళ్లకు మాత్రమే 80ఈఈఏ వర్తిస్తుందనే నిబంధన ఉన్నా, దాన్ని ఉల్లంఘించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. డిమాండ్:కావున ఈ వ్యవహారంపై సంబంధిత ఆదాయ పన్ను శాఖ, విజిలెన్స్ అధికారులు విచారణ జరిపి, అధికార దుర్వినియోగం, పన్ను ఎగవేతపై తగిన చర్యలు తీసుకోవాలని జోర్దార్ తరపున డిమాండ్ చేస్తున్నాము.

శనివారం,
అక్టోబర్ 10 2026

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# జమ్మలమ్మ ఆలయం సమీపంలోని బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



**జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి):** శాంతినగర్ పట్టణ శివారులోని జమ్మలమ్మ ఆలయం పక్కన ఉన్న బావిలో 25 నుంచి 35 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వివరాలు తెలిసిన వారు శాంతినగర్ పోలీసులకు **8712670290** నంబర్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# అదుపుతప్పి బోల్తాపడిన కారు



- ఐదుగురికి స్వల్ప గాయాలు

**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)** హుజురాబాద్ పట్టణంలోని వరంగల్--కరీంనగర్ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున కారు బోల్తాపడిన ప్రమాదంలో ఐదుగురు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.
జమ్మికుంటకు చెందిన ఐదుగురు యువకులు వరంగల్‌కు వెళ్తుండగా వివేకానంద విగ్రహం వద్ద వేగంగా వచ్చిన క్రెటా కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని,పోచయ్య హోటల్ ఎదుట బోల్తాపడింది. ఈ ఘటనలో విద్యుత్ స్తంభం,చెట్టు విరిగిపోగా కారు ధ్వంసమైంది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ కమల ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహోన్నత వ్యక్తిత్వం

కాలచక్రభ్రమణంలో
సాగే జీవనయానం
తుదకు యెటు చేర్చునో
అనూహ్యం

ఒడిదుడుకులు ఎదురైనా
కావాలి ప్రతిఒక్కరికీ
ఆత్మస్థైర్యంతో
తట్టుకునే మనోనిబ్బరం

వడ్డించిన విస్తరి జీవితమని
భ్రమ చెందక
సమస్యనధిగమిస్తూ సాగడమే
మహోన్నత వ్యక్తిత్వం

అన్నివేళలా సహకరించని
ఆత్మాభిమానం
పరిస్థితులకు అనుగుణంగా
మారడమే మానవనైజం

సమస్త మానవాళి
సమున్నత సయోధ్యభావనతో
నిష్కల్మష హృదయంతో
మెలిగితే జన్మధన్యం



సిరిపురం వాణిశ్రీ
కరీంనగర్

# మృత్యువుకు ఆహ్వానం పలుకుతున్న ఎండిన చెట్టు

- ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకోని అధికారులు



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)** హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్ ఎదురుగా గర్ల్స్ హైస్కూల్ రోడ్డులో భారీ ఎండిన చెట్టు ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో చెట్టు ఎప్పుడు విరిగి పడుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.
చెట్టు సమీపంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో పాటు, ప్రతి గురువారం నిర్వహించే వారసంతకు వ్యాపారులు, కొనుగోలు దారులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. శుభకార్యాల సమయంలో వాహనాలను కూడా చెట్టు కింద పార్కింగ్ చేస్తున్నారు.
దీంతో ప్రమాదం జరిగితే ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ఎండిన చెట్టును తొలగించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, తక్షణమే స్పందించి చెట్టును తొలగించి ప్రమాదాన్ని నివారించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కాంట్రాక్ట్ వైద్య ఆరోగ్య ఉద్యోగుల నాలుగో రోజు మౌన దీక్ష

- డిమాండ్లు పరిష్కరించకపోతే అత్యవసర సేవలు నిలిపివేస్తామని హెచ్చరిక



**చింతూరు,(ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంట్రాక్ట్ వైద్య ఆరోగ్య ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు చింతూరు డివిజన్‌లో ఉద్యోగులు నాలుగో రోజు మౌన దీక్ష చేపట్టారు. తమ సమస్యలను నెల రోజులుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు 100 శాతం గ్రాస్ జీతం చెల్లించాలని, విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించినప్పటికీ, మృతుల కుటుంబాలకు తగిన భరోసా,ఆర్థిక సహాయం అందలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం శాంతియుతంగా నిరసన కొనసాగిస్తున్నామని, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్క రించకపోతే అత్యవసర సేవలను కూడా నిలిపివేస్తామని హెచ్చరించారు.
ఈ దీక్షలో చింతూరు డివిజన్‌కు చెందిన శ్రీనివాస్, రామ కృష్ణ,ప్రవీణ్ కుమార్, జయ లక్ష్మి,సీతయ్య, గంగరాజు,పలీన,రాజమణి తదితరులు పాల్గొన్నారు.

# 44వ జాతీయ రహదారిపై బైక్ ప్రమాదం తండ్రీకూతుళ్లకు తీవ్ర గాయాలు



**జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి)** జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం బోరవెల్లి స్టేజి సమీపంలోని 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఉండవల్లి మండలం పుల్లూరు వసతి గృహం నుంచి దసరా సెలవుల కోసం తన కూతురిని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తీసుకెళ్తుండగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోదండాపురం గ్రామానికి చెందిన తండ్రీ కూతుళ్లు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

- 2,000 మంది విద్యార్థులతో అవగాహన కార్యక్రమం



**హసన్ పర్తి,(జోర్దార్ ప్రతినిధి)** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వాటి బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారులు సూచించారు. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ లోని స్కిల్ స్టార్క్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో శుక్రవారం సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ సీపీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు,లఘు చిత్రాల ద్వారా ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరగాళ్ల మోస పూరిత మాటలకు ఆకర్షితులు కావద్దని, అనుమానాస్పద లింకులను తెరవడం, వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.
విద్యార్థులు తాము తెలుసుకున్న విషయాలను కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేసి సైబర్ నేరాలపై సమాజంలో మరింత అవగాహన పెంచాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 16 ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలకు చెందిన సుమారు 2,000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డీసీపీ సెంట్రల్ జోన్ డి. కవిత, హనుమకొండ ఏసీపీ పి. నర్సింహారావు, సైబర్ క్రైమ్ ఏసీపీ ఎం. వెంకటరమణ, కేయూసీ సి ఐ రవికుమార్,పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన సబ్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఆది వాసి ప్రెస్ క్లబ్ బృందం



**చింతూరు,(జోర్దార్ ప్రతినిధి)** చింతూరు నూతన సబ్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు స్వీకరించిన చిట్టిపులి నరేంద్ర పడాల్, ఐఏఎస్‌ను చింతూరు డివిజన్ ఆదివాసి ప్రెస్ క్లబ్ బృందం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపింది.
ఈ సందర్భంగా ఆదివాసీల సంక్షేమం, విద్య, వైద్యం, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులకు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.
ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాక సీతారామయ్య, కార్యదర్శి మీడియం రమణమ్మ, సభ్యులు జల్లి నరేష్, ముచ్చిక నాగార్జున, తుర్రం చంటి, సోడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి):** హుజురాబాద్ మండలం సింగాపూర్‌లోని వైఎస్సార్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రాధాన్యతను వివరించారు.
ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి అజయ్ కుమార్, కల్చరల్ ఆర్గనైజర్ ఎన్. రమాదేవి, అధ్యాపకులు కోమల, రచన, తిరుపతి, సదయ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు దసరా పండుగ అడ్వాన్స్ 25 వేలు

**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:** సింగరేణిలో పనిచేస్తున్న (పర్మినెంట్) ఉద్యోగులకు ప్రతి సంవత్సరం ఇచ్చే దసరా పండుగ అడ్వాన్సును 25 వేలుగా నిర్ణయించి సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసినట్లు, మంద మర్రి ఏరియా గుర్తింపు కార్మిక సంఘం, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తెలిపారు.
బదిలీ పిల్లర్ కార్మికులకు, ట్రైనింగ్ చేస్తున్న వారికి, తాత్కాలిక కార్మికులకు 12 వేల 5 వందల రూపాయలు దసరా పండుగకు వారం రోజుల ముందు చెల్లిస్తారని తెలిపారు.

# రామాపురం పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**జోగులాంబ గద్వాల జోర్దార్ ప్రతినిధి:** రామాపురం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బి. నరసింహ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గునుగు, తంగేడు, బంతి పూలతో బతుకమ్మలను పేర్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ఈ సందర్భంగా చాటిచెప్పారు.
అనంతరం సమీపంలోని ఆర్డీఎస్ కాలువలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

# సమ్మక్క ప్రధాన పూజారి కుటుంబానికి జాతర కమిటీ చైర్మన్ పరామర్శ



**హైదరాబాద్, (జోర్దార్ ప్రతినిధి):** హైదరాబాద్ సమ్మక్క--సారలమ్మ జాతరలో గత 30 ఏళ్లుగా ప్రధాన పూజారిగా సేవలందించిన తడన్ల చిన్నక్క శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న హుజురాబాద్ సమ్మక్క--సారలమ్మ జాతర కమిటీ చైర్మన్ గంట కిరణ్ కుమార్ రెడ్డి, గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని ఆమె నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట విజయ్, సల్మాన్ రాజ్, శ్రీపతి సాగర్, మేడిపల్లి విజయ్ తదితరులు ఉన్నారు.

# పీఆర్సీ గడువు పెంపు ఆలోచనను విరమించుకోవాలి

- 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయాలి
ఎం.ఏ. హమీద్



**హైదరాబాద్,(జోర్దార్ ప్రతినిధి)** పీఆర్సీ కమిషన్ గడువు పెంచే ఆలోచనను తెలంగాణ ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని టీఎన్జీవోల కేంద్ర సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. హమీద్ డిమాండ్ చేశారు. ఇప్పటికే పీఆర్సీ అమలులో 39 నెలల జాప్యం జరిగిందని, ఇకనైనా కమిషన్ నివేదిక తెప్పించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు,పెన్షనర్లకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ఐదు డీఏలు చెల్లించాల్సి ఉండగా రెండు మాత్రమే మంజూరు చేసిందని, మిగిలిన మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ అమలు చేయడంతోపాటు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని కోరారు.
కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి షరతులు లేకుండా ఎంపానెల్డ్ ఆసుపత్రుల్లో హెల్త్ కార్డుల ద్వారా వైద్య సేవలు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని హమీద్ కోరారు.

## ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ బాధ్యత

# గ్రామపంచాయతీలకే అప్పగించాలి



● ఇందిరమ్మ కమిటీలను తక్షణమే రద్దు చేయాలి
● బీసీ జేఏసీ డిమాండ్

**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)** గ్రామపంచాయతీలకు పాలకవర్గాలు ఎన్నికైన నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ బాధ్యతను గ్రామపంచాయతీలకే అప్పగించాలని బీసీ జేఏసీ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షుడు సందేల వెంకన్న డిమాండ్ చేశారు. హుజురాబాద్ మున్సిపాలిటీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలను కొనసాగించడం వల్ల గ్రామపంచాయతీల పాలకవర్గాల అధికారాలు నిర్వీర్యమవుతున్నాయని అన్నారు.
ప్రస్తుత పాలకవర్గాల ఆధ్వర్యం లోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే బాధ్యతను అప్పగించి, పాత కమిటీలను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వన్నాల శివాజీ, బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షులు మామునూరు ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతికుమార్, దేవసాని ప్రియదర్శిని, రామ్ సారయ్య, బండ తిరుపతి, దాట్ల ప్రభాకర్, పోగు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ కలహాల నేపథ్యంలో

## కానిస్టేబుల్ ఆత్మహత్య



**జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి)**ఎర్రవల్లి చౌరస్తాలోని పదో బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు (27) ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్లు సమాచారం. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం

# సమ్మక్క సారలమ్మ ఆలయ పూజారి

## చేన్నక్క కన్నుమూత



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**హుజురాబాద్ పట్టణంలోని రంగనాయకుల గుట్ట సమ్మక్క సారలమ్మ ఆలయ పూజారి చేన్నక్క (70) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు తోటి పూజారి బోరుగాల అజయ్ తెలిపారు. దాదాపు 20 ఏళ్లుగా హుజురాబాద్‌లో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా అమ్మవార్లను సంప్రదాయబద్ధంగా గద్దెలపైకి చేర్చే ప్రధాన క్రతువులో చేన్నక్క కీలక పాత్ర పోషించారు. సుదీర్ఘకాలం అమ్మవార్ల సేవలో కొనసాగిన ఆమె మృతి పట్ల స్థానిక భక్తులు, ఆలయ నిర్వాహకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## బతుకమ్మ ఏర్పాట్ల పనులను పరిశీలించిన

# మున్సిపల్ చైర్‌పర్సన్



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**హుజురాబాద్ పట్టణంలో సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని చేపడుతున్న కల్వర్టు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రోంటాల సుహాసిని మనోజ్ రావు శుక్రవారం పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకునే బతుకమ్మ పండుగకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.
పండుగను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన పనులను పూర్తిచేస్తామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సొల్లు సునీత బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ వినయ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రమ దోపిడీకి, వెట్టిచాకిరికి గురైన భాషా పండితులు

# గాంధేయ మార్గంలో భాషా పండితుల నిరసన

**వెట్టిచాకిరీకి పరాకాష్ట - అర్హతలు ఒకటే, జీతం మాత్రం తక్కువే:**
ప్రాథమిక పాఠశాలలో ఇంటర్‌తో బోధిస్తే, ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లు డిగ్రీ తో బోధిస్తారు. భాషా పండితులు (తెలుగు, హిందీ, ఉర్దూ) కూడా డిగ్రీ పండిట్ ట్రైనింగ్ అర్హతతో 6 నుండి 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాలల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. అర్హతలు సమానమైనా, జీతం మాత్రం ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే ఇవ్వడం శ్రమ దోపిడీ కాదా?

**సుప్రీంకోర్టు తీర్పును తుంగలో తొక్కిన ప్రభుత్వాలు:**
ఉన్నత పాఠశాలల్లో పనిచేసే వారికి స్కూల్ అసిస్టెంట్ గా పరిగణించి పనికి తగిన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. అయినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ వరకు ప్రభుత్వాలు పట్టించుకోలేదు. భాషా పండితులు పదవ తరగతి స్పెషల్ క్లాసులు, ఇన్విజిలేషన్, స్పాట్ వాల్యుయేషన్ లో స్కూల్ అసిస్టెంట్ల కంటే ఎక్కువ పనిచేసినా, హాజరు పట్టికలో మాత్రం వారిని తక్కువ చేసి చూపి మానసికంగా వేధించారు.

**ఎన్నికలొస్తే జీవోలు - ఎన్నికలు పోతే అటకెక్కే జీవోలు:**
శాసన మండలి ఎన్నికలు వచ్చినప్పుడల్లా అప్‌గ్రేడేషన్ పేరుతో జీవోలు 2, 3, 11, 12 విడుదల చేసి, ఎన్నికలు అయిపోగానే అటకెక్కించడం గత ప్రభుత్వాలకు పరిపాటిగా మారింది. "తాంబూలాలు ఇచ్చాము తన్నుకు చావండి" అన్నట్లు గత సర్కారు వ్యవహరించింది. భాషా పండితుల ఉన్నతీకరణకు మిత్రులు హైకోర్టులో స్టే తెస్తే, ప్రభుత్వం కౌంటర్ కూడా వేయకుండా చేతులెత్తేసింది.
అధికారిక, సాహిత్య కార్యక్రమాలు, ఉపాధ్యాయ దినోత్సవాలకు వ్యాఖ్యాతలుగా భాషా పండితులను వాడుకుని అధికారులు మన్ననలు పొందారే తప్ప, వారి న్యాయమైన డిమాండ్ ను తదితర సంఘాలు కూడా వాయిదా వేస్తూ వచ్చాయి. సుప్రీంకోర్టు ఆదేశించినా, అప్పటి ప్రభుత్వం 1/2005 చట్టం తెచ్చి ఉన్నతీకరణను అడ్డుకుంది. 2014 లో తెలంగాణ వచ్చినా పరిస్థితి మారలేదు.

**ప్రస్తుత ప్రభుత్వంపై ఆశ - ప్రధాన డిమాండ్లు:**
2024 లో కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పెండింగ్ లో ఉన్న స్టేపై కౌంటర్ వేసి 10 వేలకు పైగా పోస్టులను అప్ గ్రేడ్ చేసి కొంత న్యాయం చేసింది.

**ఇప్పుడు భాషా పండితుల ప్రధాన డిమాండ్లు ఇవి:**
1. **1/2005 చట్టం రద్దు:** భాషా పండితులకు గొడ్డలి పెట్టుగా ఉన్న ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలి.
2. **నోషనల్ సర్వీసు:** 2005 కంటే ముందు చేరిన వారికి ఆర్థిక భారం లేకుండా, చేరిన తేదీ నుండే స్కూల్ అసిస్టెంట్ గా నోషనల్ సర్వీసు ఇవ్వాలి.
3. **గెజిటెడ్ హోదా:** లు చేసిన పండితులకు ఆర్థిక భారం లేకుండా గెజిటెడ్ హోదా కల్పించాలి.

మాతృభాషకే ప్రాధాన్యత అని 2020 చెబుతుంటే, మాతృభాష బోధించే ఉపాధ్యాయుడినే వివక్షకు గురిచేయడం విడ్డూరం.
తెలంగాణ విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారే చూస్తున్నందున 1/2005 చట్టాన్ని రద్దు చేస్తారని భాషా పండితులు ఆశతో ఎదురు చూస్తున్నారు.



- డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,
అధ్యక్షులు, తెలంగాణ మహాజన రచయితల సమాఖ్య,
హైదరాబాద్.9290826988

# ఐఏఎస్‌లు ఏసీ గదులకే పరిమితం కావొద్దు

# అనే హెచ్చరిక వ్యవసాయ శాఖ డైరెక్టర్ కి వర్తించదా?



● వీడియో కాన్ఫరెన్సులకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు
● వరుస పర్యటనలతో దూకుడు చూపిస్తున్న ఏపీసీ సురేంద్ర మోహన్

**(జోర్దార్ అగ్రికల్చర్ బ్యూరో చీఫ్ -హైదరాబాద్)**ఐఏఎస్ అధికారులు ఏసీ గదులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన హెచ్చరిక అధికార యంత్రాంగంలో చర్చకు దారితీస్తోంది. అయితే ఈ ఆదేశాల అమలు విషయంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ వ్యవహారశైలిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల సమస్యలను తెలుసుకోవాల్సిన ఉన్నతాధికారి కార్యాలయ సమీక్షలు, వీడియో కాన్ఫరెన్సులకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఏసీ గదులకే పరిమితమయ్యారనే విమర్శలు!**
వ్యవసాయ రంగంలో పంటల సాగు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రత్యక్షంగా పరిశీలించాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులపై ఉంది. క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే రైతుల ఇబ్బందులు, క్షేత్రస్థాయి వాస్తవాలు పూర్తిస్థాయిలో తెలుస్తాయన్నది వ్యవసాయ రంగ నిపుణుల అభిప్రాయం. అయినప్పటికీ డైరెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదనే విమర్శలు తెరపైకి వస్తున్నాయి.
సమీక్షలు, వీడియో కాన్ఫరెన్సులకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు శాఖలో చర్చనీయాంశంగా మారాయి.



**సీఎం హెచ్చరికకు విలువ లేదా?**
ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్న ప్రభుత్వ లక్ష్యం ఆచరణలో ఎంతవరకు అమలవుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో వాటి అమలుపై అధికారుల పనితీరును సమీక్షించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో వ్యవసాయ డైరెక్టర్ పర్యటనలపై వస్తున్న విమర్శలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**ఒకే శాఖ.. ఇద్దరు అధికారుల భిన్నమైన పనితీరు!**
మరోవైపు ఏపీసీ, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ వరుస పర్యటనలతో క్షేత్రస్థాయిపై దృష్టి సారిస్తున్నారనే చర్చ సాగుతోంది. జిల్లాల్లో పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షించడం, అధికారులతో సమన్వయం చేసుకోవడంలో ఆయన చురుకుదనం ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో ఒకే శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఇద్దరు ఉన్నతాధికారుల పనితీరుపై పోలికలు మొదలయ్యాయి. ఒకరు క్షేత్రస్థాయి పర్యటనలతో చురుకుదనం చూపిస్తుంటే, మరొకరు పర్యటనలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదనే విమర్శలు చర్చకు వస్తున్నాయి.

**రైతుల సమస్యల పరిష్కారమే అసలు లక్ష్యం!**
వ్యవసాయ శాఖలో ఉన్నతాధికారుల పనితీరును కేవలం సమీక్షలు, సమావేశాల ఆధారంగా కాకుండా క్షేత్రస్థాయి పర్యవేక్షణ, రైతుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాల ఆధారంగా అంచనా వేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డైరెక్టర్ పై వస్తున్న విమర్శల నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయి పర్యటనల వివరాలు, శాఖ తీసుకుంటున్న చర్యలపై స్పష్టత రావాల్సి ఉంది. సంబంధిత అధికారి వివరణ వెలువడితే ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.
మొత్తానికి.. ముఖ్యమంత్రి ఆశిస్తున్న క్షేత్రస్థాయి పాలన లక్ష్యం వ్యవసాయ శాఖలో ఎంతవరకు అమలవుతోంది? రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. ఆరోపణలపై అధికారిక వివరాలు, సంబంధిత అధికారి వివరణ వెలువడితేనే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుంది.

# గణిత ఉపాధ్యాయులకు

## ఖాన్ అకాడమీపై శిక్షణ



● ముగిసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం..
● చివరి రోజు బతుకమ్మ సంబరాలు

**పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి:**పెద్దపల్లి జిల్లా పరిధిలోని 230 మంది గణిత శాస్త్ర ఉపాధ్యాయులకు ఖాన్ అకాడమీ, సామర్థ్య నిర్మాణంపై నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది.
పెద్దపల్లిలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులకు గణిత బోధనలో నైపుణ్యాలను పెంపొందించడం, ఖాన్ అకాడమీ ద్వారా బోధనా పద్ధతులపై అవగాహన కల్పించడం, వృత్తిపరమైన సామర్థ్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ శిక్షణ కొనసాగింది. శిక్షణ కార్యక్రమం చివరి రోజు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ దశరథం, వనరుల వ్యక్తులుగా సంతోష్, రమేష్, అకినపల్లి శ్రీనివాస్, కె. అనిల్, బి. మల్లేశ్వర్ రావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పన్ను మినహాయింపు క్లెయిమ్‌లపై ఫిర్యాదు

● హెచ్ఆర్ఏ, గృహ రుణ వడ్డీ మినహాయింపులపై విచారణకు వినతి
● రూ.68 లక్షల గృహ రుణానికి సంబంధించి 80ఈఈఏ క్లెయిమ్‌పై పరిశీలనకు డిమాండ్

**హన్మకొండ జోర్దార్ ప్రతినిధి:**
హన్మకొండ జిల్లాలోని ఓ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఆదాయ పన్ను మినహాయింపుల క్లెయిమ్‌లకు సంబంధించి జోర్దార్ వార్తా సంస్థకు ఫిర్యాదు అందింది. కుమార్‌పల్లిలో సొంత ఇల్లు ఉన్నప్పటికీ హెచ్ఆ ర్ఏ కింద రూ. 1,14,915, గృహ రుణ వడ్డీ కింద రూ. 3.50 లక్షలు క్లెయిమ్ చేసినట్లు ఫిర్యాదుదారు పేర్కొన్నారు.
అదేవిధంగా రూ.68 లక్షల గృహ రుణానికి సంబంధించి ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80ఈఈఏ కింద అదనపు మినహాయింపు పొందినట్లు ఆరోపించారు.
సొంత ఇల్లు ఉండటంతో పాటు హెచ్ఆర్ఏ మినహాయింపు పొందడం అన్ని సందర్భాల్లోనూ నిబంధనల ఉల్లంఘనగా పరిగణించలేం. ఉద్యోగి వాస్తవ నివాసం, అద్దె చెల్లింపు, సొంత ఇంటి వినియోగం వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది.
అలాగే గృహ రుణ వడ్డీపై మినహాయింపు, సెక్షన్ 80ఈఈఏ కింద అదనపు ప్రయోజనాల అర్హతను సంబంధిత చట్టపరమైన ప్రమాణాలు, రుణ పత్రాలు, ఆస్తి వివరాల ఆధారంగా నిర్ధారించాలి.

సదరు ప్రిన్సిపాల్ సమర్పించిన పన్ను మినహాయింపు క్లెయిమ్‌లు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయో లేదో సంబంధిత ఆదాయ పన్ను శాఖ అధికారులు పరిశీలించాలని ఫిర్యాదుదారు కోరారు.
అవసరమైతే సంబంధిత శాఖ విజిలెన్స్ అధికారులు కూడా అంశాన్ని పరిశీలించి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
ఈ విషయంపై సంబంధిత ప్రిన్సిపాల్ వివరణ, ఆదాయ పన్ను శాఖ స్పందన, అధికారిక విచారణ వివరాలు ప్రస్తుతం అందుబా టులో లేవు. ఆరోపణలు స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు.
సంబంధిత పత్రాలు, వర్తించే చట్ట నిబంధనలను పరిశీలించిన తర్వాతే ఈ వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఆదర్శ పాఠశాలలో ఘనంగా
# బతుకమ్మ సంబరాలు



**వికారాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**వికారాబాద్ జిల్లా మరిపల్లి మండలంలోని ఆదర్శ పాఠశాలలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ జి. ప్రమీల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.
రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ చుట్టూ తిరుగుతూ సంప్రదాయ ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అరుణతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వడ్డెపల్లి ప్రభుత్వ పాఠశాల
# ప్రధానోపాధ్యాయుడు సస్పెండ్

**హనుమకొండ,(జోర్దార్ ప్రతినిధి)**హనుమకొండ జిల్లా వడ్డెపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు ఎల్. నరేందర్ నాయక్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ సస్పెండ్ చేశారు. బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించడంతోపాటు, అసభ్య పదజాలం ఉపయోగించారనే ఆరోపణలపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో పోలీసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది జోక్యం చేసుకోగా, తెలంగాణ స్టూడెంట్స్ ఫెడరేషన్ సహా విద్యార్థి సంఘాలు అధికారులకు వినతిపత్రాలు అంద జేశాయి. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ పరిశీలన అనంతరం సస్పెన్షన్‌కు ఆమోదం తెలపడంతో, తెలంగాణ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనల ప్రకారం ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నారు. క్రమశిక్షణా చర్యలు పూర్తయ్యే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. విద్యార్థుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ప్రతిభావంతులైన విద్యార్థినులకు
# 10 వేల రూపాయల ప్రోత్సాహకం



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**హుజురాబాద్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన పది మంది విద్యార్థినులకు డీటీఎఫ్ నాయకుడు పలకల ఈశ్వర్ రెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 10 వేల రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఏడాది పాఠశాలలో 500కు పైగా మార్కులు సాధించే విద్యార్థినులకు ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొరగాల తిరుమల, స్వామిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రెడ్డికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# 51 శాతం ఫిట్‌మెంట్‌తో
# పీఆర్సీ వెంటనే ప్రకటించాలి




- 36 నెలలు గడిచినా పీఆర్సీ నివేదిక రాకపోవడం విచారకరం
- టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు బూరుగు రవికుమార్ గౌడ్ డిమాండ్

**భూపాలపల్లి జోర్దార్ ప్రతినిధి :**ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని టీఎన్జీఓ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బూరుగు రవికుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. పీఆర్సీ గడువు ముగిసి 36 నెలలు గడిచినా నివేదిక తెప్పించకపోవడం విచారకరమని పేర్కొన్నారు.
శుక్రవారం టీఎన్జీఓ భవన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)లో అనేక లోపాలు ఉన్నాయని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అందించాలని కోరారు.
ఈహెచ్ఎస్ కింద ఉచిత వైద్యం అందక మరణించిన ఉద్యోగులు లేదా వారి కుటుంబాలకు నిబంధనల ప్రకారం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.
ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీఎన్జీఓ జిల్లా కార్యదర్శి ఏ. దశరథ రామారావు కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సురేందర్ రెడ్డి, అన్వర్, మురళీధర్ రెడ్డి, సలీంరాజీ, శ్రీదేవి, ప్రవీణ్ కుమార్, సాంబ శివరావు, సుకుమార్, మజీద్, జన్నుకుమార్, బి.ఈ. రాణి, రణధీర్, రేష్మ, ప్రసాద్, దేవేందర్, విజయ్, ప్రశాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే
# తెలంగాణ అల్పాహార కార్యక్రమ లక్ష్యం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి.



**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులు ఉదయం పూట ఆకలితో ఇబ్బందులు పడకుండా, పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంగా చదువులో రాణించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలంగాణ అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు.
శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించారు.
అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి, ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అనేకమంది తల్లిదండ్రులు ఉదయాన్నే తమ పనులకు వెళ్లే పరిస్థితుల్లో పాఠశాలలకు వచ్చే పిల్లలకు ఉదయం పూట అల్పాహారం అందించడం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.
విద్యార్థులు ఆకలిని మరిచి చదువుపై పూర్తి శ్రద్ధ పెట్టేలా, పౌష్టికాహారం ద్వారా ఆరోగ్యంగా ఉండేలా దోహదపడుతుందని అన్నారు.
విద్య ప్రతి విద్యార్థి జీవితాన్ని మార్చే గొప్ప ఆయుధమని, పేదరికం కారణంగా ఏ విద్యార్థి విద్యకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత:**
ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, నాణ్యమైన విద్య అందేలా ప్రోత్సహించాలని కోరారు.
విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, భవిష్యత్తులో వారి కుటుంబాలకు, బెల్లంపల్లి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.
విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ విద్యావ్యవస్థ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఎంఈఓ, మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రత్నం సుకుమారి, కౌన్సిలర్ జంగం కల్పన,
కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీ గదులకే పరిమితమవుతున్న వ్యవసాయ డైరెక్టర్?

- సీఎం రేవంత్ హెచ్చరిక గోపికి వర్తించదా?
- క్షేత్రస్థాయి పర్యటనలపై విమర్శలు.. దూకుడు చూపిస్తున్న ఏపీసీ సురేంద్ర మోహన్



**జోర్దార్ అగ్రికల్చర్ బ్యూరో చీఫ్, హైదరాబాద్:**ఐఏఎస్ అధికారులు ఏసీ గదులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన హెచ్చరిక అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి పనితీరుపై మాత్రం విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయి పర్యటనలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా సమీక్షలు, వీడియో కాన్ఫరెన్సులకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యవసాయ శాఖలో పంటల పరిస్థితులు, ఎరువుల లభ్యత, రైతుల సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది. క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే రైతుల ఇబ్బందులు, క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుస్తాయని వ్యవసాయ రంగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో డైరెక్టర్ గోపి పర్యటనలపై వస్తున్న విమర్శలు చర్చకు దారితీస్తున్నాయి. మరోవైపు ఏపీసీ, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్ వరుస పర్యటనలతో క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షిస్తున్నారనే చర్చ సాగుతోంది. దీంతో ఒకే శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారుల పనితీరుపై పోలికలు మొదలయ్యాయి. ఒకవైపు క్షేత్రస్థాయి పర్యటనలతో చురుకుదనం ప్రదర్శిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, మరోవైపు డైరెక్టర్ గోపి పర్యటనలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
ముఖ్యమంత్రి ఆశిస్తున్న క్షేత్రస్థాయి పాలన వ్యవసాయ శాఖలో ఎంతవరకు అమలవుతోందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. డైరెక్టర్ గోపి క్షేత్రస్థాయి పర్యటనల వివరాలు, రైతుల సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై స్పష్టత రావాల్సి ఉంది.
ఈ ఆరోపణ లపై సంబంధిత అధికారి వివరణ వెలువడితే వాస్తవ పరిస్థితిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# అల్ఫోర్స్‌లో అంబరాన్నంటిన
# బతుకమ్మ, దాండియా సంబరాలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక
- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి



**కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి:**బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, సంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ మహోత్సవం, దాండియా వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి భక్తిశ్రద్ధలతో పూజించడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకతగా నిలుస్తుందన్నారు. ప్రకృతిని ఆరాధించడం, పూల ప్రాముఖ్యతను గుర్తించడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం బతుకమ్మ పండుగ ప్రధాన సందేశమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పండుగైన బతుకమ్మను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. దాండియా భారతదేశంలోని ప్రసిద్ధ సంప్రదాయ జానపద నృత్యాల్లో ఒకటని, గుజరాత్‌లో ఉద్భవించిన ఈ నృత్యం నవరాత్రి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని తెలిపారు. దాండియా నృత్యం ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తుందని చెప్పారు. సద్దుల బతుకమ్మకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, మహిళలు బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో వేడుకలు నిర్వహించడం తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఏటా ఇటువంటి వేడుకలను నిర్వహిస్తూ విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు కళాత్మకంగా రూపొందించిన బతుకమ్మలను ప్రదర్శించగా, బతుకమ్మ పాటలు, దాండియా గీతాలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దామెర పాఠశాలలో ఘనంగా
# బతుకమ్మ వేడుకలు



**ఎల్కతుర్తి,జోర్దార్ ప్రతినిది:**ఎల్కతుర్తి మండలంలోని దామెర ప్రాథమిక పాఠశాల (ఎస్సీ కాలనీ) లో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం రాజేశ్వరి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తొమ్మిదో తరగతి పరీక్షల మూల్యాంకనం పూర్తి



**హుజురాబాద్,(యూత్ ప్రతినిధి)**తొమ్మిదో తరగతి విద్యార్థుల పరీక్ష పత్రాల మూల్యాంకనం ఈ నెల 3న ప్రారంభమై 9వ తేదీతో సజావుగా ముగిసిందని మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఏడు పరీక్షలకు సంబంధించి అన్ని సబ్జెక్టుల్లో 52 మంది ఉపాధ్యాయులు మొత్తం 1,631 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసినట్లు వెల్లడించారు. విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. మూల్యాంకనానికి సహకరించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
శనివారం,
అక్టోబర్ 10 2026



# నవ్వుల వెనుక దాగిన మౌనాన్ని విందాం!

- శరీరానికే కాదు... మనసుకు కూడా వైద్యం కావాలి
- అక్టోబర్ 10 ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా
- "జ్వరం వస్తే ఆసుపత్రికి పరుగెడతాం - మనసు విరిగితే ఎందుకు పట్టించుకోం?"

జ్వరం వస్తే కుటుంబమంతా కంగారు పడతాం. కానీ ఒక మనిషి నెలల తరబడి నిద్రలేకుండా, నిరాశతో, ఒంటరిగా మౌనంగా మిగిలిపోతే "అంతా బాగానే ఉంది" అనుకుని వదిలేస్తాం. మానసిక ఆరోగ్య దినోత్సవం వేడుక కాదు, మన సమాజానికి ఇది ఒక హెచ్చరిక.

**1. కనిపించని గాయాలకు మందు ఏది?**
ప్రతి చిరునవ్వు ఆనందానికి గుర్తు కాదు. మన చుట్టూ ఎందరో ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు, సంబంధాల సంక్షోభంతో లోలోపల పోరాడుతున్నారు. వారికి మనం ఇచ్చే "ధైర్యంగా ఉండు" అనే ఉపదేశం కాదు, అర్థం చేసుకునే ఒక మనసు కావాలి.

**2. అన్నీ ఉన్నా... ఆత్మీయత కరువే!**
ఆధునిక జీవితం సౌకర్యాలను పెంచింది, ఒత్తిడిని రెట్టింపు చేసింది. విద్యార్థికి మార్కులు, యువతకు ఉద్యోగం, వృద్ధులకు ఒంటరితనం. సోషల్ మీడియా ప్రపంచాన్ని దగ్గర చేసింది కానీ, పక్కన ఉన్న మనిషికి దూరం చేసింది. వేల ఆన్‌లైన్ ఫ్రెండ్స్ ఉన్నా, వినే నిజమైన చెవి లేకపోవడమే ఈ తరం విషాదం.

**3. పిల్లలకు మార్కులు వద్దు... మనోధైర్యం కావాలి!**
పిల్లల చేతిలో పుస్తకం ఉందా అని చూస్తున్నాం కానీ, మనసులో ఏముందో చూడటం లేదు. "ఎన్ని మార్కులు?" అని అడుగుతున్నాం కానీ, "ఎలా ఉన్నావు?" అని అడగడం లేదు. విజయాన్ని నేర్పే ముందు వైఫల్యాన్ని తట్టుకునే ధైర్యాన్ని నేర్పకపోతే, చిన్న ఓటమే పెద్ద సంక్షోభం అవుతుంది.

**4. కౌన్సెలింగ్ అంటే అవమానం కాదు - అది ఆత్మరక్షణ!**
కౌన్సెలర్‌ను కలవడం బలహీనత కాదు. సహాయం కోరేవాడు పిరికివాడు కాదు, తన జీవితాన్ని కాపాడుకునే ధైర్యవంతుడు. శరీరానికి జ్వరం వస్తే డాక్టర్ దగ్గరకు వెళ్లడం ఎంత సహజమో, మనసు బాధకు నిపుణుడిని కలవడం అంతే సహజం కావాలి.

**5. సంభాషణే తొలి మందు - విశ్రాంతే మనసుకు విందు!**
బాధను దాచిపెడితే తగ్గదు, పెరుగుతుంది. ఎవరైనా మౌనంగా ఉంటే "నేను నీతో ఉన్నాను" అనే భరోసా చాలు. మనిషి యంత్రం కాదు - ఎప్పుడూ గెలవాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు ఆగాలి, ఊపిరి పీల్చాలి.

పాఠశాలల్లో కౌన్సెలింగ్, కార్యాలయాల్లో మానవీయ వాతావరణం, గ్రామాల్లో మానసిక సేవలు రావాలి.

**ముగింపు మాట:** విరిగిన ఎముకకు శబ్దం ఉంటుంది, విరిగిన మనసుకు ఉండదు. మనసును కాపాడటం అంటే ఒక వ్యక్తిని కాదు, ఒక కుటుంబాన్ని, ఒక భవిష్యత్తును కాపాడటం.



పోగు అశోక్, రచయిత

# ఈవీఎం గోదాంలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన



**వరంగల్,(జోర్దార్ ప్రతినిధి)**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ఎనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదాంను నెలవారీ తనిఖీలో భాగంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.
గోదాం నిర్వహణ, రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలను సమీక్షించారు. ఈవీఎంల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని, భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ ఎల్. కిషోర్ కుమార్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎన్నికల సూపరింటెండెంట్ రజిని తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం




**ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. హుస్సేన్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదిలా బాద్‌లోని సంరక్షణ ప్రత్యేక పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ఒత్తిడిని అధిగమించేందుకు కుటుంబ సభ్యులతో మనసు విప్పి మాట్లాడటం, నిద్ర, వ్యాయామం, యోగా, ధ్యానం అలవాటు చేసుకోవాలని సూచించారు. మానసిక సమస్యలు దీర్ఘకాలం కొనసాగితే నిపుణులను సంప్రదించాలన్నారు. అనంతరం విద్యార్థులు పేర్చిన బతుకమ్మలను ప్రారంభించి, పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళిని తుంగలో తొక్కిన ప్రభుత్వ అధ్యాపకుడు

# విచారణలో దోషిగా తేలినా చర్యలు శూన్యం!

**ఉప శీర్షికలు:**
- భారత రాష్ట్ర సమితి అభ్యర్థికి మద్దతుగా బహిరంగ ప్రచారం - చాయాచిత్రాలు, కదిలే చిత్రాలు సాక్ష్యంగా
- రెండేళ్ల క్రితం ఫిర్యాదు - ఎట్టకేలకు అభియోగ పత్రం జారీ
- తక్షణమే విధుల నుండి తొలగించాలని విద్యాభిమానుల డిమాండ్

**(జోర్దార్ విద్యా ప్రత్యేక ప్రతినిధి / హైదరాబాద్:)** ప్రభుత్వం నుండి జీతం తీసుకుంటూ, విద్యార్థులకు నీతి, నియమం, రాజ్యాంగ విలువలు బోధించాల్సిన ప్రభుత్వ అధ్యాపకుడే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండగా ఒక రాజకీయ పార్టీకి తొత్తుగా మారి బహిరంగంగా ప్రచారం చేయడం విద్యా వ్యవస్థకే మచ్చగా మారింది.

**1. అసలు ఆరోపణలు ఏమిటి? - ఎక్కడ, ఎప్పుడు జరిగింది?**
2023 శాసనసభ సాధారణ ఎన్నికల సమయంలో, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి కఠినంగా అమలులో ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీకి మద్దతు తెలపకూడదు, ప్రచారంలో పాల్గొనకూడదు అని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి.
కానీ మహబూబ్ నగర్ లోని తెలుగు అధ్యాపకుడు నర్సింహా రెడ్డి నివాసంలో, మెట్టుగడ్డ ప్రాంతంలో, 01-11-2023 నాడు భారత రాష్ట్ర సమితి పోటీ అభ్యర్థి వి. శ్రీనివాస్ గౌడ్ కు మద్దతుగా ప్రభుత్వ అధ్యాపకులు రహస్య రాజకీయ సమావేశం నిర్వహించారని ఆరోపణ.
ఈ సమావేశంలో శ్రీ పి. మధుసూదన్ రెడ్డి, అర్థశాస్త్ర జూనియర్ అధ్యాపకుడు (గతంలో సరూర్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, రంగారెడ్డి జిల్లాలో పనిచేసి, ప్రస్తుతం కొడైర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాగర్ కర్నూల్ జిల్లాలో పనిచేస్తున్నారు) పోటీ అభ్యర్థి పక్కనే కూర్చుని, వేదికపై నుండి లేచి "ప్రతి ఇంటికి 5 పుస్తకాలు (నాడు-నేడు) పంచాలి" అని బహిరంగంగా ప్రచారం చేశారని, అనుమతి లేకుండా కేంద్ర స్థానం వదిలి వెళ్లారని ఆరోపణ.
అంతేకాకుండా 23-11-2023 నాడు కూడా మళ్లీ అదే విధంగా అనుమతి లేకుండా మహబూబ్ నగర్ వెళ్లారని, 2019 నుండే తాత్కాలిక తొలగింపులో ఉండి కూడా నిబంధనలు పాటించలేదని ఫిర్యాదులో ఉంది.
ఈ ఆరోపణలపై న్యాయవాది శ్రీ నారపాక సురేందర్ 27-11-2023 న జరిగిన సమావేశపు చాయాచిత్రాలు, కదిలే చిత్రాలతో సహా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా అధ్యాపకుడు గతంలో విద్యుత్ దొంగతనం, అధికారులను బెదిరించడం వంటి అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు.

**2. విచారణలో ఏం తేలింది? - అభియోగ పత్రం ఎలా వచ్చింది?**
ఫిర్యాదు అందుకున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం, 03-01-2024 న ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంచాలకులకు చర్యలు తీసుకోమని ఆదేశించింది. సంచాలకులు 06-01-2024 న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, మహబూబ్ నగర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా కలెక్టర్, మహబూబ్ నగర్ లను విచారణ జరపమని ఆదేశించారు.
జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ విభాగ అధికారి మరియు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సంయుక్తంగా విచారణ జరిపి 02-04-2024 న నివేదిక ఇచ్చారు. ఆ నివేదికలో వారు చాయాచిత్రాలు, కదిలే చిత్రాలు, పెన్నులో ఇచ్చిన ప్రసంగపు వివరాలు, సంబంధిత వ్యక్తుల సంజాయిషీలను పరిశీలించారు.

**నివేదికలో పేర్కొన్న కీలక అంశాలు:**
"అధ్యాపకుడు కేంద్ర స్థానం వదలడానికి ముందు అనుమతి తీసుకోలేదు. చాయాచిత్రాలు, కదిలే చిత్రాల ఆధారంగా అధ్యాపకుడు పోటీ అభ్యర్థి పక్కనే కూర్చుని, వేదికపై నుండి ప్రసంగించినట్లు స్పష్టంగా రుజువైంది. ఆయన ఉద్దేశం పోటీ అభ్యర్థి భావాలను ప్రజల్లోకి వ్యాప్తి చేయడమే అని తేలింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 లోని 129వ నిబంధన ఉల్లంఘన జరిగింది."

**ఈ నివేదికలో మొత్తం నలుగురు దోషులుగా తేలారు:**
1. శ్రీ పి. మధుసూదన్ రెడ్డి, అర్థశాస్త్ర అధ్యాపకుడు
2. శ్రీ భగవంత చారి, ప్రధానాచార్యులు, బాలుర జూనియర్ కళాశాల, మహబూబ్ నగర్
3. శ్రీ పి. నర్సింహా రెడ్డి, తెలుగు అధ్యాపకుడు
4. శ్రీ నందూరి శ్రీనివాస్, వృత్తి విద్యా అధ్యాపకుడు

ఆ నివేదిక ఆధారంగా, ప్రభుత్వ సాధారణ పరిపాలన (ఎన్నికలు) శాఖ 22-08-2024 న శాఖాపరమైన చర్యలు తీసుకోమని ఆదేశించినా, రెండేళ్లుగా ఎలాంటి నివేదిక రాలేదు. దీంతో ప్రభుత్వం 5 సార్లు వరుసగా గుర్తుచేత లేఖలు (04-09-2024, 23-10-2024, 02-04-2026, 19-06-2026, 21-07-2026) పంపాల్సి వచ్చింది.
**ఎట్టకేలకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంచాలకు లు** దస్త్ర సంఖ్య: సిఐఇ-ఎస్ఈఆర్1/ డిసిపి 2/1/2025, తేదీ: 21/08/2026 ద్వారా మూడు అభియోగాలతో అభియోగ పత్రం జారీ చేశారు.

**అభియోగాలు:**
**1) ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నిబంధనలు 1964 లోని 19(1) మరియు 3(1) నిబంధనల ఉల్లంఘన - రాజకీయ తటస్థత పాటించకపోవడం, క్రమశిక్షణ రాహిత్యం.**
**2) 19(5) నిబంధన ఉల్లంఘన - ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొనడం.**
**3) కేంద్ర స్థానం అనుమతి లేకుండా వదిలి వెళ్లడం - ప్రభుత్వ ఉద్యోగికి తగని ప్రవర్తన.**

నిందితుడు 10 రోజుల్లోగా తన సంజాయిషీ ఇవ్వాలని, లేకపోతే ఉన్న ఆధారాలతోనే చర్యలు తీసుకుంటామని ఉత్తర్వులో హెచ్చరించారు.

**3. విద్యాభిమానుల డిమాండ్ - తదుపరి ఏం చేయాలి?**

1. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి, రాజకీయ పార్టీకి తొత్తుగా మారిన అధ్యాపకుడు పి. మధుసూదన్ రెడ్డిపై తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకుని, ఉద్యోగం నుండి తొలగించాలి.
2. 10 రోజుల్లో సంజాయిషీ ఇవ్వకపోతే ఉన్న చాయాచిత్ర, కదిలే చిత్ర సాక్ష్యాలతోనే తుది నిర్ణయం తీసుకోవాలి.
3. విద్యా వ్యవస్థకు మచ్చ తెచ్చిన ఇలాంటి వారిని విధుల నుండి తప్పించి, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన సంకేతాలు పంపాలని తల్లిదండ్రులు, విద్యావేత్తలు, విద్యాభిమానులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# రైతుల సమస్యపై స్పందించి

# ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించిన విక్టర్ బాబు



**హసన్ పర్తి,జోర్దార్ ప్రతినిధి:**రైతులకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ మూడు రోజులుగా పనిచేయక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు సంగాల విక్టర్ బాబు అండగా నిలిచారు. పంట కీలక దశలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్పందించిన ఆయన సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను వివరించారు. దీంతో అధికారులు తక్షణమే స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన విక్టర్ బాబుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట చిన్నరాజు,పెద్దరాజు, సంగాల పోలీస్ రాజు, తోట రవితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# పూల పండుగకు పాఠశాలలో పూలబాట..

# కృష్ణవేణిలో బతుకమ్మ సంబరాలు!

- 50కి పైగా బతుకమ్మలతో విద్యార్థినుల సందడి..
- సంప్రదాయ దుస్తుల్లో అలరించిన చిన్నారులు






**రామగిరి జోర్దార్ ప్రతినిధి:**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శుక్రవారం ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. 'మన కృష్ణవేణి బతుకమ్మ ఉత్సవాలు' పేరుతో నిర్వహించిన ఈ వేడుకలు పాఠశాలలో పండుగ శోభను నింపాయి. విద్యార్థినులు వివిధ రకాల పూలతో 50కి పైగా బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ ఆటపాటలు, కోలాటాలతో సందడి చేశారు. పాఠశాల విద్యాసంస్థల కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బర్ల శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పే విశిష్టమైన పండుగ అని పేర్కొన్నారు. ప్రకృతి ఒడిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి గౌరీమాతను ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకతని తెలిపారు.

**ఐక్యతకు ప్రతీక.. ప్రకృతికి ఆరాధన**
బతుకమ్మ వేడుకలు సమాజంలో ప్రేమ, ఆప్యాయతలు, ఐక్యతను పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. బొడ్డెమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు మహిళలు, యువతులు, చిన్నారులు జానపద గేయాలు, సంప్రదాయ ఆటపాటలతో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారని వివరించారు. ప్రతి ఒక్కరూ మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ భావితరాలకు వాటి గొప్పతనాన్ని అందించాలని సూచించారు.

**సంప్రదాయ దుస్తుల్లో చిన్నారుల సందడి**
విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంగురంగుల పూలతో వివిధ రూపాల్లో బతుకమ్మలను తీర్చిదిద్ది, కోలాటాలతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడం తోపాటు పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రంజిత్ రెడ్డి, ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# గణిత ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణ

## ఖాన్ అకాడమీ, సామర్థ్యాల పెంపుపై అవగాహన

## ముగింపు రోజున ఘనంగా బతుకమ్మ సంబరాలు



**(పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి)**పెద్దపల్లి జిల్లాలోని గణిత శాస్త్ర ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాలను పెంపొందించడంతోపాటు ఆధునిక బోధనా పద్ధతులపై అవగాహన కల్పించేందుకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దపల్లిలోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన 230 మంది గణిత శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
ఈ శిక్షణలో భాగంగా ఖాన్ అకాడమీ వినియోగం, ఉపాధ్యాయుల సామర్థ్యాల పెంపు తదితర అంశాలపై శిక్షణ అందించారు. విద్యార్థులకు గణిత శాస్త్రాన్ని మరింత సులభంగా, ఆసక్తికరంగా బోధించేందుకు ఉపయోగపడే పద్ధతులపై అవగాహన కల్పించారు.
ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడింది.
శిక్షణ కార్యక్రమం చివరి రోజున బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు సంప్రదాయ పండుగ వాతావరణంలో ఉత్సాహంగా పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.
ఈ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్‌గా దశరథం వ్యవహరించగా, వనరుల వ్యక్తులుగా సంతోష్, రమేష్, అకినపల్లి శ్రీనివాస్, కె. అనిల్, బి. మల్లేశ్వర్ రావు పాల్గొన్నారు.

# తండ్రి కావాలంటూ చిన్నారి ఆవేదన

# స్పందించిన కేటీఆర్



- చిన్నారికి అండగా నిలవాలని పట్నం అవినాష్ రెడ్డికి సూచన

**షాబాద్,జోర్దార్ ప్రతినిధి:**తండ్రిని కోల్పోయిన ఓ చిన్నారి ఆవేదన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కదిలించింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన చిన్నారి మనసులోని బాధను చూసి స్పందించిన ఆయన, అవసరమైన సహాయం అందించేలా కృషి చేయాలని షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డికి సూచించారు. షాబాద్ మండలం మాచనపల్లికి చెందిన బైండ్ల స్పర్శ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. మూడేళ్ల క్రితం తండ్రి యాదయ్యను కోల్పోయిన స్పర్శ.. పాఠశాలలో నిర్వహించిన పరీక్షలో దేవుడిని ఏదైనా కోరిక కోరుకునే అవకాశం వస్తే ఏం కోరుకుంటావు?అనే ప్రశ్నకు నాకు మా నాన్న కావాలి అని సమాధానం రాసింది. ఈ సమాధానం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కేటీఆర్ దృష్టికి చేరింది. కేటీఆర్ సూచన మేరకు శుక్రవారం చిన్నారి స్పర్శను తన నివాసానికి పిలిపించిన అవినాష్ రెడ్డి, ఆమె కుటుంబ పరిస్థితులను తెలుసుకుని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. త్వరలోనే చిన్నారిని కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి, ఆమెకు అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాచనపల్లి సర్పంచ్ రాధ, మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి, నాయకులు గోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న

# తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్



**వరంగల్,జోర్దార్ ప్రతినిధి:**తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద శుక్రవారం భద్ర కాళి అమ్మవారి దేవస్థానాన్ని దర్శించుకున్నారు.
ఆమె వెంట తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, రాజేశ్వరరావు తది తరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో, అర్చకులు వారికి ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరంమహాదాశీర్వచనం నిర్వహించి, అమ్మ వారి శేషవస్త్రాలను బహూకరించి తీర్థప్రసాదాల ను అందజేశారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# అక్రమాలకు అవినీతికి పాల్పడుతున్న ఆదిలాబాద్ డి ఈ ఓ మాధవి

## కార్యాలయం - నిబంధనలకు తూట్లు!

- అధికార దుర్వినియోగం - అనుకూల వర్గంతో కొటారి తయారీ
- నోటిఫికేషన్ లేకుండా అక్రమ నియామకాలు - నిబంధనలు గాలికి
- 500 పైగా ఖాళీలు - రాష్ట్రంలో 30వ స్థానానికి పడిపోయిన ఆదిలాబాద్ విద్యాశాఖ




**(అదిలాబాద్ జోర్దార్ ప్రతినిధి)**జిల్లా విద్యా వ్యవస్థను గాడిలో పెట్టవలసిన జిల్లా విద్యాధికారి, తనకున్న అధికారాన్ని దుర్వినియోగపరుస్తూ, తనకు అనుకూలంగా ఉండే వారితో ఒక ప్రత్యేక ముఠాను తయారు చేసుకున్నారని, దీంతో డీఈఓ కార్యాలయం ఉపాధ్యాయ పునరావాస కేంద్రంగా మారిపోయిందని ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి.

**సహాయ గణాంక అధికారి నియామకంలో అక్రమం**
మొదట సహాయ గణాంక అధికారి (ఏఎస్ఓ) నియామకం కోసం ఒక ప్రకటన ఇచ్చారు. నిబంధనల ప్రకారం పాఠశాల సహాయకుడు (గణితం) అయి ఉండి, నిర్దేశించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన వారినే నియమించాలి. అన్ని అర్హతలున్న ఉపాధ్యాయుడిని నియమించి, వారం రోజుల్లోనే "పని పరిజ్ఞానం లేదు" అనే సాకుతో విధుల నుండి తొలగించారు.
ఆ తర్వాత పాఠశాల సహాయకుడు కాకపోయినా, ద్వితీయ శ్రేణి ఉపాధ్యాయుడిని, పాఠశాలలో మిగులు కాకపోయినా, ఎలాంటి ప్రకటన లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఏఎస్ఓ గా నియమించడం వెనుక ఆంతర్యం ఏమిటని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

**నాణ్యతా సమన్వయకర్త నియామకం వివాద కేంద్రం**
డీఈఓ కార్యాలయంలో నాణ్యతా సమన్వయకర్త నియామకం మరో వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాల విద్యా సంచాలకుల వారి ద్వారా నియామకమైన ఉపాధ్యాయుడి పనితీరు బాగోలేదని తొలగించి, తమకు అనుకూలంగా వ్యవహరించే మరో ఉపాధ్యాయుడిని ఎలాంటి ప్రకటన లేకుండా, జిల్లా పాలనాధికారిని కూడా తప్పుదోవ పట్టించి నిబంధనలకు విరుద్ధంగా నియమించారని ఆరోపణ.
అతనికి సహాయకుడిగా మరొక ఉపాధ్యాయుడిని జిల్లా కేంద్రానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉట్నూర్ నుండి నిబంధనలకు విరుద్ధంగా ప్రతినియుక్తి (డిప్యుటేషన్) పై తీసుకువచ్చారు.

**విచ్చలవిడి నియామకాలు,డిప్యూటేషన్లు - టాస్ లో కూడా:**
తెలంగాణ బహిరంగ పాఠశాల సంస్థ కార్యక్రమాల కోసం చాలా కాలంగా ఒక ఉపాధ్యాయుడు పనిచేస్తుండగా, అవసరం లేకపోయినా మరో ఉపాధ్యాయుడిని నియమించడం సరైన పద్ధతి కాదని ఆరోపణ.
అదేవిధంగా జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటులో కూడా తనకు అనుకూలమైన వారు ఎక్కడ ఉన్నా వారిని జిల్లా కేంద్రానికి ప్రతినియుక్తిపై తెప్పించుకుంటున్నారని ఫిర్యాదు.

**పాలనాధికారి హామీ - అమలు శూన్యం:**
ఈ విషయాలన్నింటినీ 15 రోజుల క్రితం పాలనాధికారితో జరిగిన సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాయి. స్పందించిన జిల్లా కలెక్టర్ అవసరానికి మించి ఉన్న ఉపాధ్యాయులను తిరిగి వారి పాఠశాలలకు పంపిస్తానని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు అక్రమంగా ప్రతినియుక్తిపై కొనసాగుతున్న వారిలో ఒక్కరిని కూడా విడుదల చేయలేదని సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

**ప్రైవేటు యాజమాన్యాలకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు:**
ఈ ఏడాది ఉపాధ్యాయ దినోత్సవం నాడు పురస్కారాలు ఇచ్చే సందర్భంగా నిజాయితీగా, వృత్తి నిబద్ధతతో పనిచేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులను పక్కనబెట్టి, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ఇవ్వడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.
ఒకవైపు ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి, ప్రైవేటు కార్పొరేటు విద్యా సంస్థలను నియంత్రించాలని ప్రజలు, సంఘాలు కోరుకుంటుంటే, ఆదిలాబాద్ డీఈఓ ప్రైవేటు యాజమాన్య ప్రతినిధులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రకటించి సత్కరించడం ప్రభుత్వ విద్యా రంగానికి వ్యతిరేకంగా, ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడమే అవుతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**గైర్హాజరుపై చర్యలు లేవు - 30వ స్థానానికి పతనం:**
జిల్లాలో తరచుగా విధులకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయుల గురించి దినపత్రికలు ప్రస్తావించినా వారిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు జోరుగా చర్చ జరుగుతోంది.
ఒకవైపు జిల్లాలో 500 పైగా ఉపాధ్యాయ కొలువులు ఖాళీగా ఉండి ఉపాధ్యాయ కొరత తీవ్రంగా ఉండగా, మరోవైపు ఇలా విచ్చలవిడిగా అక్రమ ప్రతినియుక్తులతో డీఈఓ కార్యాలయాన్ని పునరావాస కేంద్రంగా మార్చి, ఒంటెత్తు పోకడలతో నియామకాల్లో నిబంధనలను తుంగలో తొక్కి, జిల్లా విద్యా రంగాన్ని పర్యవేక్షించకపోవడం వల్ల ఈరోజు ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖ రాష్ట్రంలో 30వ స్థానంతో అట్టడుగుకు పడిపోయింది.

**డిమాండ్:**
కావున పాఠశాల విద్యా సంచాలకుల కార్యాలయం వెంటనే స్పందించి, ఆదిలాబాద్ డీఈఓ పై సమగ్ర విచారణ జరిపి, అక్రమ ప్రతినియుక్తులను రద్దు చేసి, అర్హులకు న్యాయం చేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్ హరగోపాల్ ప్రసంగంపై వివాదం

- ఎండోమెంట్ ఉపన్యాసానికి ఆహ్వానించడంపై రిజిస్ట్రార్‌ను నిలదీసిన బీజేపీ నాయకులు
- హరగోపాల్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్....



**వరంగల్:**కాకతీయ యూనివర్సిటీలో గురువారం ప్రొఫెసర్ బాలగోపాల్ స్మారక ఎండోమెంట్ ఉపన్యాసం సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలు వివాదానికి దారితీశాయి. ఈ కార్యక్రమానికి హాజరైన హెచ్‌సీయూ విశ్రాంత ప్రొఫెసర్ హరగోపాల్ చేసిన వ్యాఖ్యలు ఒక వర్గాన్ని అవమానపరిచే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రంను గురువారం కలిసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్‌పై కేసు నమోదు చేయాలని, ఇలాంటి కార్యక్రమాలకు ఆయనను ఆహ్వానించడంపై రిజిస్ట్రార్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.
బీజేపీ నాయకుల ఆరోపణల ప్రకారం, ఒక వర్గం మనోభావాలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని విశ్వవిద్యాలయం వంటి విద్యాసంస్థకు ఆహ్వానించడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. మానవ హక్కుల గురించి మాట్లాడే వ్యక్తులు అన్ని వర్గాల పట్ల సమాన గౌరవం చూపాలని, ఏ వర్గాన్నీ అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయకూడదని వారు అభిప్రాయపడ్డారు. సమానత్వం, సామాజిక గౌరవం వంటి విలువలకు ప్రాధాన్యతనివ్వాల్సిన విశ్వవిద్యాలయం ఇలాంటి వివాదాలకు తావులేకుండా వ్యవహరించాలని కోరారు.

**హరగోపాల్‌పై గతంలో నమోదైన కేసును ప్రస్తావించిన బీజేపీ నాయకులు...**
ప్రొఫెసర్ హరగోపాల్‌పై గతంలో నమోదైన కేసును కూడా బీజేపీ నాయకులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. వారి వాదన ప్రకారం, 2022 ఆగస్టు 19న ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా), ఆయుధాల చట్టం, అప్పటి భారత శిక్షాస్మృతిలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఆ ఎఫ్‌ఐఆర్‌లో ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు మరో 152 మంది ఉద్యమకారులు, మేధావుల పేర్లు ఉన్నాయని, మావోయిస్టులకు సంబంధించిన పుస్తకాల్లో హరగోపాల్ పేరు ప్రస్తావన ఉందనే కారణంతో పోలీసులు కేసు నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.
ఈ నేపథ్యంలో, గతంలో కేసు నమోదైన వ్యక్తిని విశ్వవిద్యాలయానికి ఆహ్వానించి, ఆయన ప్రసంగం ద్వారా ఒక వర్గం మనోభావాలు దెబ్బతిన్నాయని ఆరోపణలు వస్తున్న పరిస్థితుల్లో, సంబంధిత వ్యాఖ్యలపై విచారణ జరపాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కేవలం గతంలో కేసు నమోదైందనే కారణంతో ఎవరినైనా దోషిగా పరిగణించలేమన్న న్యాయపరమైన అంశాన్ని పక్కన పెట్టకుండా, ప్రస్తుత కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యల స్వభావం, వాటి సందర్భం, వాటివల్ల ఎవరైనా అవమానానికి గురయ్యారా అనే అంశాలను పరిశీలించాలని వారు కోరారు.

**రిజిస్ట్రార్‌కు ప్రశ్నలు...**
ప్రొఫెసర్ హరగోపాల్ వంటి వ్యక్తిని ఎండోమెంట్ ఉపన్యాసానికి ఆహ్వానించడానికి గల కారణాలేమిటని బీజేపీ నాయకులు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రంను ప్రశ్నించినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం నిర్వహించే విద్యా, సాహిత్య, స్మారక కార్యక్రమాలు అన్ని వర్గాల గౌరవాన్ని కాపాడే విధంగా ఉండాలని పేర్కొన్నారు. ఒక వర్గాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి మానవ హక్కులపై మాట్లాడే నైతిక అర్హత లేదని వారు విమర్శించారు.
అన్ని వర్గాల ప్రజలను సమానంగా గౌరవించే దృక్పథం కలిగిన వక్తలను ఆహ్వానించాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయ అధికారులపై ఉందని బీజేపీ నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలపై స్పష్టత ఇవ్వాలని, ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత చట్టపరమైన చర్యలు తీసుకునేలా పోలీసులకు ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేశారు.

**పోలీసులే సుమోటోగా విచారణ చేపట్టాలన్న డిమాండ్..**
ఈ వ్యవహారాన్ని పోలీసులు సుమోటోగా పరిగణించి, కార్యక్రమంలో చేసినట్లు ఆరోపణలు వస్తున్న వ్యాఖ్యలపై విచారణ జరపాలని బీజేపీ నాయకులు కోరారు. ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం పాత్రపై కూడా చట్టప్రకారం పరిశీలన జరిపి, నేరం జరిగినట్లు ఆధారాలు లభిస్తే సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.
విశ్వవిద్యాలయాలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని, ప్రజాస్వామ్య విలువలను, పరస్పర గౌరవాన్ని పెంపొందించే కేంద్రాలుగా ఉండాలని, ఏ కార్యక్రమమైనా సామాజిక సామరస్యానికి విఘాతం కలగకుండా నిర్వహించాల్సిన అవసరం ఉందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ వివాదంపై విశ్వవిద్యాలయ అధికారులు, పోలీసుల స్పందన ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# తెలంగాణ ఆడ బిడ్డల ఆత్మ గౌరవ ప్రతీక బతుకమ్మ

పూల పండగకు వేళాయే బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో చిత్తు చిత్తుల బొమ్మ శివుడి ముద్దుల గుమ్మ అంటూ లయబద్ధంగా వారం పాటు బతుకమ్మ పాటలు మార్మోగనున్నాయి .
తెలంగాణా సంస్కృతిలో బతుకమ్మ పెద్ద పండుగ. ఈ పండుగ తర్వాతే మిగత పండుగలు. అంత గొప్పగా, అత్యంత భక్తి శ్రద్ధలతో సనాతన బతుకమ్మ పండుగను నిర్వహిస్తారు. బతుకమ్మ వివిధ రంగురంగుల పూల పండుగ. గృహలక్ష్మీల భక్తి, నిష్ఠల పండుగ. ఇంటింటి పండుగ. ప్రకృతి దేవతను పూలతో పేర్చిన బతుకమ్మ రూపంలో ఆరాధిస్తారు. ఈ నెల 10 నుండి బతుకమ్మ సంబురాలు ప్రారంభం కానున్నాయి.
దీంతో తెలంగాణా ప్రజలు ప్రకృతి ఆరాధకులుగా గౌరవించబడుతున్నారు. అయితే ఏదో ఒక నేపథ్యం, ఏదో ఒక సంఘటన చేసిన ప్రభావితంతో ప్రజలు అందరూ ఏకమై వాటి స్ఫూర్తితో, వాటి స్మృతితో జరుపుకునే కార్యక్రమాల పరంపరలో పండుగలుగా మారతాయి. ఆవిధంగా నిర్వహింపబడుతున్న నేపథ్యంలో తెలంగాణా సంస్కృతిలో బతుకమ్మ పండుగకు ఎన్నో గాథలున్నాయి. ద్వాపార యుగం నుంచి : ద్వాపార యుగంలో శ్రీకృష్ణుని చుట్టూచేరి గోపికలు ప్రతీనిత్యం ఆడి, పాడి శ్రీకృష్ణునిపై భక్తి గానామృతంతో పులకించిపోవడాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువతులు... తాము ఆడి, పాడిన కార్యక్రమం... రానురాను బతుకమ్మ పండుగగా వాసికెక్కిందని పౌరాణికులు చెబుతారు.దుర్గాదేవిని సేదతీర్చిన క్రమంలో: లోకకంటకుడైన మహిషాసురుడు అనే రాక్షసుడిని దుర్గాదేవి యుద్ధంలో సంహరించి లోకకల్యాణంగావించింది. ఈ క్రమంలో యుద్ధంలో ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి మహాలయ అమావాస్యనాడు అలసి పోయి సుప్తావస్థల్లోకి వెళ్ళింది. దీంతో మహిళలంతా అమ్మవారికి సేదతీర్చి యథాస్థితికి తీసుకురావడానికి ఆట, పాటల తో సేవలు చేశారు. తొమ్మిదో రోజు తల్లి అలసట తీరి పూర్వ వైభవంతో మహటరీజ్వల ప్రకాశితయై బాసించినది. దీంతో మహిళా ప్రపంచమంతా ఎంతో ఆనందోత్సాహాలతో పండుగ చేసుకుంటూ లోకమాత అయిన దుర్గామాత.... సర్వ జనులకు బతుకునిచ్చే అమ్మవారైనందున ఆమెకు "బతుకమ్మ" అనే నామ కరణం చేసి ఆమె స్మృతికి ఏటా తొమ్మిది రోజులు బతుకమ్మ పండుగ జరుపుకోవడం తెలంగాణా మహిళా మణులకు సనాతనంగా సంస్కృతి అయిందని పురాణికులు చెబుతారు.
**శ్రీవాసవి పూజ నుంచి :** శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవత పూజనుంచి బతుకమ్మ పండుగ వచ్చిందని వైశ్యులుచెప్పు కుంటారు.
**తామరపువ్వు లక్ష్మీదేవి అవతారం :** ఓ రాజు ఓ కొలనులో తామర పువ్వును వేశాడు. దాంతో కొలను చుట్టూ తంగేడుపూలు పూస్తాయి. ఈ క్రమంలో విష్ణుమూర్తి అక్కడ ప్రత్యక్షమై రాజు వేసిన తామర పువ్వును లక్ష్మీదేవతగా చేస్తాడు. ఈమెను లక్ష్మీదేవి అవతారంగా కొలవండని చెబుతాడు. ఆ లక్ష్మీ అవతారం పువ్వువల్ల కొలనులోని పూలన్నింటికి బతుకువచ్చినందున ఆదేవతను బతుకమ్మగా ప్రజలు కొలిచారు.
**త్యాగంతో బతుకమ్మ:** బతుకమ్మ అనే ఓ త్యాగమూర్తి వరద ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడి తన ప్రాణాలను త్యాగం చేయడంతో ఆమె స్మారకంగా బతుకమ్మ పండుగను జరుపుకుంటున్నారని కథనం ఉంది.
**8వ సంతానం బతుకమ్మ:** పూర్వం ఓ దంపతులకు వరుసగా సంతానం మరణించింది. ఈ క్రమంలో 8వ సంతానంగా ఓ ఆడపిల్ల జన్మించింది. ఈమెకు బతుకమ్మ అనే పేరు పెట్టారు. దాంతో ఆమె బతికింది. యుక్త వయసుకు వచ్చి వివాహానంతరం ఆమె తన మెట్టినింటికి వచ్చింది. ఆ ఇంట్లో భర్తసోదరి ఆమెను ద్వేశించి హత్య చేయించింది. ఆమె విషాధ మరణం మహిళా లోకాన్ని కలచివేసింది. దీంతో ఆమె స్మృతిగా తంగేడు పూలతో బతుకమ్మ పండుగను జరుపుకుంటారు. తమ హృదయాల్లో బతుకమ్మను శాశ్వతంగా బతికించుకుంటూ ఆమెను చిరంజీవురాలిని చేశారు.
**చోళరాజు కూతురు :** పూర్వం చోళరాజు రుక్మాంగదుడుకు కలిగిన ఏకైక సంతానాన్ని బతికించుకోడానికి గౌరీదేవిని నవ రాత్రులు పూలతో పూజించాడు. దేవీ అనుగ్రహంతో సంపూర్ణ ఆరోగ్యవతియైన కుమార్తెకు బతుకమ్మ అని పేరు పెట్టాడు. అప్పటినుంచి కుమార్తె గౌరీదేవి అంశతో పుట్టిందనీ పాపను ప్రకృతి పూలతో ఏటా వేడుకగా పండుగ జరుపుకోవడంతో ప్రజలుకూడా ఆనవాయితీగా బతుకమ్మ పండుగను గొప్పగా జరుపుకున్నారు.
**చోళరాజు చర్యకు నిరసనగా....** క్రీ. శ. 1003–1004లో మొదటి రాజేంద్ర చోళుడు వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి(బృహదీశ్వరస్వామి) దేవాలయంపై దాడి చేసి స్వామి (బృహదీశ్వర శివ) లింగాన్ని తన కంచి నగరానికి (తంజావూరు)కు అపహరించుకు వెళ్ళాడు. దీంతో శివుని వియోగంతో దుఃఖితయైన బృహతమ్మ(పార్వతమ్మ), (రాజరాజేశ్వరీదేవి)ను ప్రజలు ముఖ్యంగా మహిళలు ఊరడించే క్రమంలో ప్రకృతిపూలు తంగేడు, గునుగు, కట్ల తదితర పూలతో మేరు పర్వతంలా సిబ్బిల్లో పేర్చి గుమ్మడి పువ్వుల్లోని పసుపుగౌరమ్మలను ప్రతిష్ఠించి బృహతమ్మను ఆట, పాటల తో ప్రార్థిస్తూ, భజిస్తూ తొమ్మిది రోజులు ఊరడిస్తూ "బృహతమ్మ" పండుగ జరిపారు. ఈ విధంగా బృహతమ్మ పండుగ రానురాను "బతుకమ్మ పండుగ"గా మారింది. ఇదే క్రమంలో మొదటి రాజేంద్ర చోళుడు వేములవాడ శివలింగాన్ని అపహరించుకు పోయినందుకు తెలంగాణమంతటా ప్రజల నుంచి బతుకమ్మలతో నిరసన జ్వాలలు పెల్లుబికాయి.... ఈ స్ఫూర్తితో తెలంగాణా ఉద్యమం.... మహిళల బతుకమ్మల ప్రదర్శనలతో ప్రంభంజనమై సాగడం తెలిసిందే.
కాకతీయుల కాలంలో : కాకతీయుల చరిత్రకు ఆధారమైన "సిద్ధేశ్వర చరిత్ర"లో బతుకమ్మ ప్రస్తావన ఉంది. దీనిప్రకారం కాకతీయుల కాలంలో బతుకమ్మను ఆడేవారని తెలుస్తున్నది. కాగా బతుకమ్మను కాకతీయులు మహిళల సామూహిక ఉత్సవంగా నిర్వహించేవారు. దీంతో సామాజిక ఐక్యతను పెంపొందించేవారు. 5వ శతాబ్దంలో కాకతీయుల మూల పురుషుడు మాధవవర్మ బతుకమ్మ పండుగను గొప్పగా నిర్వహించాడు. నల్గొండ జిల్లా వాడపల్లిలోని బ్రతుకేశ్వర స్థానంలో క్రీ.శ.1211లో కాకతి గణపతిదేవచక్రవర్తి పేరుమీద మేలుగుంట సోదరులు తమ తల్లిదండ్రులు కోడె మైలసానిస్మృతికి బతుకమ్మ గుడి (త్రికూటాలయాన్ని) కట్టారు. దీంతో సమీపంలోని కృష్ణా నదిలో మహిళలతో బతుకమ్మ ఆడించి నిమజ్జనం చేయించేవారని ఒక శాసనం ద్వారా తెలుస్తున్నది. రుద్రమదేవి తన శత్రురాజు దేవగిరి యాదవరాజు మహాదేవున్ని క్రీ.శ. 1265లో ఓడించినందుకు విజయ సూచకంగా బతుకమ్మ పండుగ సంబరాలను విజయోత్సవంగా నిర్వహించింది. ఆ క్రమంలో ఆమె ప్రతియేడు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి పండుగకు విశిష్ఠత ను చేకూర్చింది. బతుకమ్మతో మహిళలకు ఐక్యతనూ, స్త్రీ సాధికారతను చేకూర్చింది.బతుకమ్మ ఆడిన మాచలదేవి కాకతీయ సామ్రాజ్యంలో బతుకమ్మ పండుగపై మహిళలకు భక్తి, శ్రద్ధలను మరెంతగానో పెంపొందించడానికి ప్రతాపరుద్రచక్రవర్తి రాజనర్తకి మాచలదేవి రాజధాని ఓరుగల్లు నగరంలో ప్రతీఏటా మహిళ లతో కలిసి బతుకమ్మ పండుగలో పాల్గొని ఆడి, పాడేదని చెబుతారు.
**శాతవాహనుల కాలంలో:** క్రీ.పూ. 1వ శతాబ్దం నాటికే బతుకమ్మ తెలంగాణా కోటి లింగాల నుండి శ్రీకాకుళం లోని జగతిపాడు వరకు విస్తరించింది. అయితే శాతవాహనుల కాలంలో సాధారణ ప్రజల బతుకమ్మ ఉన్నత వర్గాల ప్రజల గౌరీ దేవిగా రూపాంతరం చెందింది
**ఒక పురాణగాథ:** దక్షయజ్ఞంలో ఆహుతైన సతి... పార్వతిగా పునర్జన్మ పొందడంతో... ఆమెను ఉద్దేశించి ప్రజలంతా బతుకమ్మా అని ప్రార్థిస్తారు. అప్పటి నుంచి ఈ బతుకమ్మ పండుగను ఆనవాయితీగా జరుపుకుంటున్నారు.కుతుబ్ షాహీలూ, అసఫ్ జాహీల కాలాల్లో వీరి కాలాల్లో బతుకమ్మ కొనసాగింది. తెలుగు సంస్కృతిని పోషించిన ఇబ్రహీం కుతుబ్ షాహీని ఒక ప్రసిద్ధమైన బతుకమ్మ పాటలో కీర్తించడం ఉంది. ఇక అసఫ్ జాహీల (నిజాం) కాలంలోను బతుకమ్మ పండుగ ఎంతో గొప్పగా కొనసాగింది.
**దొరలగడిల బతుకమ్మగా విమర్శ:** బతుకమ్మ పండుగ... దొరల గడీల బతుకమ్మ అనే విమర్శలున్నాయి. భూస్వామ్యవ్యవస్థ, పెత్తందారీ దొరల కాలంలో దొరసానులు పేద మహిళలతో వెట్టిగా తంగేడు, గునుగు, తదితర పూలు తెప్పించుకొని, బతుకమ్మలు పెద్దఎత్తున వారితోనే పేర్పించి, వారితోనే మోయించి తెప్పించి ఆడేవారు. సామాన్య మహిళలకు బతుకమ్మఆడే అర్హత లేదనే దొరసానుల దుర్మార్గ వైఖరిని తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం తీవ్రంగా ప్రతిఘటించింది. దొరలగడీల బతుకమ్మ, దొరసానుల బతుకమ్మనూ, దొరతనాలకు వ్యతిరేకంగా పోరాడి బతుకమ్మను పేదోళ్ళ ఇంటి ముందుకు తెలంగాణా సాయుధ పోరాటం తీసుకు వచ్చింది. అప్పటి నుంచి తారతమ్యం లేని సామూహిక మహిళల ఉత్సవంగా.... బతుకమ్మ పండుగ గొప్పగా కొనసాగుతూ వస్తాంది.నిజాం పాలనకు వ్యతిరేకంగా బతుకమ్మ పండుగను వేదికగా చేసుకొని నిజాం దుర్మార్గపాలన అంతానికి మహిళలను ఉత్తేజపరిచి కదం తొక్కించి రణంలోకి ఉరికించారు. ఈ క్రమంలో తెలంగాణా సాయుధపోరు బతుకమ్మ పాటలు కట్టించింది. తద్వారా మహిళలు నిజాం విముక్తి పోరాటంలో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఒకరినొకరు ఉత్తేజ పరచడానికి, సందేశాలు అందించుకోడానికి బతుకమ్మ పాటలు అప్పుడు పెద్ద ఆధారమైనాయి. ఈ క్రమంలో రానురాను బతుకమ్మ పండుగపై ఆరాధనా భావం పెంపొందగా.... మేడల్లోని దొరసానులూ, ధనిక మహిళలు మేడలు దిగి వచ్చి గ్రామంలోని సామాన్య మహిళలతో మానవ హారంగా ఏర్పడి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడి, పాడీ బతుకమ్మ పండుగకు గొప్ప ఖ్యాతినితెచ్చారు. ఈ విధంగా ఆడీ, పాడీ స్నేహం, సోదరీభావం, ఐక్యతా, ప్రేమానురాగాలు మహిళల్లో పెంపొందించారు. ధనిక, పేద తేడా లేకుండా, అందరూ సమానమంటూ బతుకమ్మ పండుగతో ప్రజాస్వామ్య స్ఫూర్తినీ, అలాగే మహటరీన్న త మానవతా సంబంధాలను కొనసాగించారు. బతుకమ్మను 9రోజులు ఆరాధిస్తే లక్ష్మీదేవిని ఆరాధించినట్లేననీ, అలాగే తమ మాంగళ్యం బల ంగా ఉండి దీర్ఘ సుమంగళిగా వర్ధిల్లుతామనీ, గౌరీదేవి, లక్ష్మీదేవికి ప్రతీక అయిన బతుకమ్మను పూజిస్తే ధన, ధాన్యాలూ, భోగ, భాగ్యాలూ, సుఖ, సంతోషాలనూ ప్రసాదిస్తుందనీ పెళ్ళీడుకచ్చిన యువతులకు మంచి భర్తలు లభిస్తారనీ, సంతా నం లేనివారికి అవుతుందనీ, బలమైన భక్తి, వి శ్వాసం బతుకమ్మ పండుగపై ఏర్పడింది.
**స్త్రీ జీవితానికి బతుకమ్మ ప్రతీక :** స్త్రీ జీవితానికి బతుకమ్మ ప్రతీక అని చెబుతారు. నవరసాలు, నవధాన్యాలు, నవ మాసాలు బతుకమ్మకు తొమ్మిది రోజులు (నవ దినాలు).
**విదేశీ స్త్రీల బతుకమ్మ :** బ్రహెయిన్లో తెల్ల స్త్రీలు, గుజరాతి స్త్రీలు బంకింగ్ హటరీంలో, ఆంగ్ల వనితలు లండన్ లో, ఇంకా వివిధ దేశాల్లో బతుకమ్మను ఆడుతుండడంతో పూల బతుకమ్మకు ప్రపంచఖ్యాతి వచ్చి తెలంగాణా బతుకమ్మ కీర్తి పతాకం ప్రపంచ శిఖరంపై రెపరెపలాడుతూ సనాతన పండుగ వైభవాన్ని మహటరీజ్వలంగా చాటుతోంది.
**ఆశ్వీయుజశుద్ధ పాడ్యమీ నుంచి:** ప్రతీ ఏడాది ఆశ్వీయుజశుద్ధ పాడ్యమీ మహాలయ అమావాస్య నుంచి దుర్గాష్టమీ వరకు తొమ్మిది రోజుల పండుగను హిందూ మహిళలు ఎంతో నియమ, నిష్ఠలతో భక్తి, శ్రద్ధలతో మహా వైభవంగా జరుపుకుంటారు.
**బతుకమ్మకు తొమ్మిది పేర్లు..., తొమ్మిది నైవేద్యాలు:** మొదటిరోజు నిర్వహించే బతుకమ్మను ఎంగిలి పూల బతుకమ్మగా పిలుస్తారు. ఈ రోజు బతుకమ్మకు నువ్వులూ, నూకలూ, నైవేద్యంగా సమర్పిస్తారు. 2వరోజు అటుకుల బతుకమ్మకు ఉడకబెట్టిన పప్పు, బెల్లం, అటుకులు, 3వరోజు ముద్దపప్పు బతుకమ్మకు తడిబియ్యం, పాలు, బెల్లం, 4వరోజు నానబియ్యం బతుకమ్మకు తడిబియ్యం, పాలు, బెల్లం, 5వరోజు అట్ల బతుకమ్మకు అట్లు, 6వరోజు అలిగిన బతుకమ్మకు అట్లు, 7వరోజు వేపకాయల బతుకమ్మకు వేప పండ్ల ఆకారంలో బియ్యం పిండి, 8వరోజు వెన్న ముద్దల బతుకమ్మకు వెన్న, నువ్వులు, బెల్లం, 9వరోజు సద్దుల బతుకమ్మకు 5లేదా 9రకాల సద్దులను నైవేద్యంగా మహిళలు సమర్పిస్తారు.బతుకమ్మ పాటల్లో సందేశం బతుకమ్మలవద్ద మహిళలు పాడుకునే పాటల్లో సమాజ సందేశం పురాణాలు, చరిత్ర, స్నేహం, బంధుత్వం, భక్తి, మానవ సంబంధాల మేళవింపు ఉంటాయి. 'వలలో', 'చందమామ', 'కోల్ ', 'నాగమల్లెలో', 'తీగమల్లెలో', 'మదానో నావయారీ' మొదలైన ఊత పదాలుంటాయి. చిల్లరదేవుళ్ళు" సినిమాలో తొలిసారిగా బతుకమ్మ పాట 45 ఏళ్ళ క్రితం వరంగల్కు చెందిన సినిమా దర్శకుడుటి. మాధవ రావు "చిల్లరదేవుళ్ళు" చిత్రంలో తొలిసారిగా బతుకమ్మ పండుగనూ, బతుకమ్మ పాటనూ( శ్రీలక్ష్మి నీమహిమలు గౌరమ్మ) చూపి బతుకమ్మ పండుగకూ, బతుకమ్మ పాటకూ ప్రఖ్యాతి తెచ్చారు. అలాగే మరో దర్శకుడు ప్రభాకర్ 'బతుకమ్మ' పేరుతోనే సినిమాను తీసి ఆ పండుగ వైభవాన్ని ప్రపంచానికి చాటాడు.
**బతుకమ్మలతో నీటిశుద్ధి:** విజ్ఞానశాస్త్ర పరంగా బతుకమ్మలతో నీరు శుద్ధి అవుతుందని చెబుతారు. చెరువుల్లో ఎన్నోమలినాలు కలిసి నీరు కలుషితమయ్యే నేపథ్యంలో నీటిద్వారా టైఫాడ్, కలరా, డయేరియా, నిమోనియా, టి.బి., శ్వాసకోశ, చర్మవ్యాధులు వస్తాయి. ఇవి నీటిలో నివసించే హానికరమైన సూక్ష్మ జీవులైన బాక్టీరియాలు, వైరస్లు, శిలీంద్రాల వల్ల వస్తాయి. బతుకమ్మలో పేర్చే తంగేడు, గునుగు, కట్ల, బంతి, పట్నంబంతి, పట్టుకుచ్చులు, గుమ్మడి, బీర ఆకులపై అనేక తెల్లటి కేశాలుంటాయి. వీటిలో గల గ్రంథులలో సూక్ష్మ జీవులను నాశనం చేసే రసాయనాలు ఉంటాయి. దీని వల్ల బతుకమ్మలను చెరువుల్లో వేయడం వల్ల వాటిల్లోని మానవ రోగకారక సూక్ష్మ జీవులు చనిపోతాయి.అందుకే బతుకమ్మలను మానవులకు, పశు, పక్ష్యాదులకు వచ్చే వ్యాధులను నివారించే శక్తి దేవతగా, నీటిని శుద్ధిచేసే దేవతగా భావిస్తారు.తెలంగాణా ఉద్యమంలో ప్రముఖ పాత్ర : తెలంగాణా ఉద్యమంలో బతుకమ్మ ద్వారా స్త్రీశక్తిని ఒక తాటిపై నడపడం జరిగింది. తెలంగాణా సాధనలో బతుకమ్మ ప్రముఖ పాత్ర పోషించింది. 2014 జూన్ 16న తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించింది. 2014 అక్టోబర్ 2న తొలిసారిగా తెలంగాణా అప్పటి ప్రభుత్వం ఈ పండుగను అధికారికంగా నిర్వహించింది. అప్పటి నుంచి ప్రతీయేడు బతుకమ్మను ప్రభుత్వం వైభవోపేతంగా నిర్వహిస్తూ తెలంగాణా మహోన్నత బతుకమ్మ పండుగ సంస్కృతికి ఎనలేని గౌరవం తెస్తోంది.మన సంస్కృతి సంప్రదాయాలను నలు దిక్కులా చాటుదాం .అక్టోబర్ 10 నుండి బతుకమ్మ పండగ ప్రారంభం సందర్భంగా

కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా
9848445134

## బీజేపీ హటావో.. బీసీ బచావో!

# ఢిల్లీ ధర్నాలో పెద్దపల్లి ఓబీసీ శ్రేణులు

- డిసెంబరులో పార్లమెంట్ ముట్టడికి పిలుపు



**పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి:**ఓబీసీల హక్కుల సాధన, సమగ్ర కులగణన డిమాండ్‌తో ఢిల్లీలో చేపట్టిన ఆందోళనలో పెద్దపల్లి ఓబీసీ శ్రేణులు పాల్గొన్నాయి. ఢిల్లీలోని తెలంగాణ భవన్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట వివిధ రాష్ట్రాల బీసీ సంఘాల ఆధ్వర్యంలో రెండో రోజు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఖరిపై బీసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

**కులగణనతోనే బీసీలకు న్యాయం**
దేశ జనాభాలో 56 శాతం ఉన్న ఓబీసీలకు సమగ్ర సంక్షేమ పథకాలు అందాలంటే కులగణన తప్పనిసరి చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా బీసీలకు హక్కులు, రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీలు పప్పు యాదవ్, మల్లు రవి తదితరులు బీసీల హక్కుల సాధనకు పార్లమెంట్ వేదికగా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

**మోదీ, అమిత్ షా వైఖరిపై విమర్శలు**
కులగణన విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వైఖరిపై పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు న్యాయం జరిగేలా సమగ్ర కులగణన చేపట్టి, సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల అమలులో సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో బీసీ హక్కుల అంశాన్ని బలంగా వినిపించాలని అభిప్రాయపడ్డారు.లిడిసెంబరులో పార్లమెంట్ ముట్టడిలి ఓబీసీల హక్కులు, రిజర్వేషన్ల సాధన కోసం డిసెంబరులో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు నాయకులు ప్రకటించారు. బీసీల డిమాండ్లు నెరవేరే వరకు దేశవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ ధర్నాలో బహుజన ప్రజాస్వామిక వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తాడూరి శ్రీమన్నారాయణ, కాల్వ శ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ గోపగాని సారయ్య గౌడ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాతుల శ్రీనివాస్ గౌడ్, ఆంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకర్రావు, బీసీ యువ నాయకుడు కందుల అశోక్‌తో పాటు పెద్దపల్లి ఓబీసీ నాయకులు పాల్గొన్నారు.

## కందులలో ఘనంగా బొడ్డెమ్మ నిమజ్జనోత్సవం



**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:** హుజురాబాద్ మండలం కందుల గ్రామంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకురాలు కంకణాల సరోజన ఆధ్వర్యంలో శుక్రవారం బొడ్డెమ్మ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.
తొమ్మిది రోజుల పాటు బొడ్డెమ్మకు పూజలు నిర్వహించిన మహిళలు, ప్రత్యేక పూజల అనంతరం గ్రామంలోని చెరువులో నిమజ్జనం చేశారు.
సంప్రదాయ పాటలు పాడుతూ బొడ్డెమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శనివారం,
అక్టోబర్ 10 2026

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# అతనితో పని చేయడం, స్క్రీన్ షేర్ చేసుకోవడం ఎంతో ప్రత్యేకం



కథ ఎంత ముఖ్యమో.. ఆ కథలో భాగమయ్యే నటీనటులు, సాంకేతిక నిపుణులు కూడా అంతే ముఖ్యమని అంటున్నారు కథానాయిక మాళవిక మోహనన్. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ దక్షిణాది సినిమాలతో పాటు హిందీ చిత్రసీమలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారు. ఇటీవల 'సర్దార్ 2'తో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ భామ.. ప్రస్తుతం విజయ్ సేతుపతితో కలిసి నటించిన 'పాకెట్ నోవెల్' కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో ఓ ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. సినిమా షూటింగ్ అనేది కేవలం కెమెరా ముందు నటించడం మాత్రమే కాదని.. ఒక బృందంతో కలిసి నెలల తరబడి ప్రయాణించడం, వారితో ఎన్నో అనుభవాలను పంచుకోవడం కూడా అందులో భాగమేనని ఆమె పేర్కొన్నారు. కొన్ని సినిమాలు చేస్తున్న సమయంలో ఆ చిత్ర బృందమే ఒక ప్రత్యేకమైన ప్రపంచంలా మారిపోతుందని మాళవిక తెలిపారు. ఈ సినిమా ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో ఓ ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. సినిమా షూటింగ్ అనేది కేవలం కెమెరా ముందు నటించడం మాత్రమే కాదని.. ఒక బృందంతో కలిసి నెలల తరబడి ప్రయాణించడం, వారితో ఎన్నో అనుభవాలను పంచుకోవడం కూడా అందులో భాగమేనని ఆమె పేర్కొన్నారు. కొన్ని సినిమాలు చేస్తున్న సమయంలో ఆ చిత్ర బృందమే ఒక ప్రత్యేకమైన ప్రపంచంలా మారిపోతుందని మాళవిక తెలిపారు. పాకెట్ నోవెల్ కూడా తనకు అలాంటి అనుభూతినే ఇచ్చిందని చెప్పారు. ఈ సినిమాలో భాగం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. షూటింగ్ సమయంలో నటీనటులు, సాంకేతిక బృందం కలిసి ఎక్కువ సమయం గడుపుతారని.. రోజులో ఎన్నో గంటలు కలిసి పనిచేస్తూ ఒకరినొకరు అర్థం చేసుకుంటారని మాళవిక వివరించారు. ఈ క్రమంలోనే చిత్ర బృందంలోని వ్యక్తులు తెలియకుండానే కుటుంబ సభ్యుల్లా మారిపోతారని ఆమె అభిప్రాయపడ్డారు.పాకెట్ నోవెల్ కూడా తనకు అలాంటి అనుభూతినే ఇచ్చిందని చెప్పారు. ఈ సినిమాలో భాగం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. షూటింగ్ సమయంలో నటీనటులు, సాంకేతిక బృందం కలిసి ఎక్కువ సమయం గడుపుతారని.. రోజులో ఎన్నో గంటలు కలిసి పనిచేస్తూ ఒకరినొకరు అర్థం చేసుకుంటారని మాళవిక వివరించారు. ఈ క్రమంలోనే చిత్ర బృందంలోని వ్యక్తులు తెలియకుండానే కుటుంబ సభ్యుల్లా మారిపోతారని ఆమె అభిప్రాయపడ్డారు. 'పాకెట్ నోవెల్'లో విజయ్ సేతుపతితో కలిసి పనిచేయడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభవమని మాళవిక

# టాలీవుడ్ స్టార్ హీరో ఇంట పెళ్లి సందడి..





టాలీవుడ్ యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా ఇంట పెళ్లి సందడి మొదలైంది. ఆయన కూతురు అంజనా పెళ్లి ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఈనెల 18న ఆమె మూడుముళ్ల బంధంలోకి అడుగుపెట్టనుం ది. దాదాపు 13 ఏళ్లుగా ప్రేమలో ఉన్న అంజనా ఇప్పుడు పెద్దల సమక్షంలో ప్రియుడితో కలిసి ఏడడుగులు నడవనుంది. అయితే అంజనాకు కాబోయే భర్త ఎవరన్నది ఇంకా అధికారిక సమాచారం బయటకు రాలేదు. అయితే ఈ ప్రేమ పక్షుల ఫొటోలు మాత్రం సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. వీటిని చూసిన సినీ ప్రముఖులు, అభిమానులు కాబోయే దంపతులకు అభినందనలు, శుభాకాంక్షలు చెబుతున్నారు. చూడముచ్చటి జంట అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. కాగా దక్షిణాది సినిమా ఇండస్ట్రీలో స్టార్ నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు అర్జున్ సర్జా. 1988లో కన్నడ నటి నివేదితను ప్రేమించి పెళ్లి చేసుకున్నారీ యాక్షన్ కింగ్. వీరికి ఐశ్వర్య, అంజనా అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురు ఐశ్వర్య హీరోయిన్ గా రాణిస్తోంది. అలాగే తన తండ్రి వ్యాపారం, నిర్మాణ సంస్థ పనులు కూడా చూసుకుంటోంది.ఇక అర్జున్ చిన్న కూతురు అంజనా మాత్రం సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉంటోంది. తన ఫ్యామిలీ నేపథ్యానికి భిన్నంగా బిజినెస్ ఉమెన్ గా రాణిస్తోంది. 2023లో హ్యాండ్ బ్యాగుల తయారీ సంస్థను ప్రారంభించింది అంజనా. ఇక్కడ తయారయ్యే హ్యాండ్ బ్యాగులన్నీ కూడా కేవలం పండ్ల తొక్కలు , కూరగాయల తొక్కలు, నార వంటి వాటితోనే తయారు చేస్తారు. పర్యావరణానికి అనుకూలంగా తయారు చేస్తున్న ఈ హ్యాండ్ బ్యాగులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం బిజినెస్

# అతను ఇంత పెద్ద హీరో అవుతాడని అస్సలు అనుకోలేదు.



టాలీవుడ్ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు రెజీనా కసాండ్రా. అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ.. తెలుగు మాత్రమే కాకుండా తమిళం, హిందీ చిత్రాల్లోనూ తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. ఒకప్పుడు వరుస సినిమాలతో సందడి చేసిన రెజీనా.. ప్రస్తుతం విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతోంది. తాజాగా ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.ంజీనా కసాండ్రా 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించింది. చిన్న వయసులోనే కెమెరా ముందు కనిపించిన ఆమె.. కేవలం తొమ్మిదేళ్ల వయసులోనే పిల్లల టీవీ కార్యక్రమానికి యాంకర్‌గా వ్యవహరించింది. తన చలాకీ మాటలు, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో అప్పట్లోనే ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత నటనపై ఆసక్తితో సినిమాల్లోకి అడుగుపెట్టింది. టీనేజ్‌లోనే తమిళ చిత్రంలో కీలక పాత్ర పోషించి వెండితెరపై తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత హీరోయిన్‌గా అవకాశాలు అందుకుంటూ దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ గుర్తింపు సంపాదించుకుంది.రెజీనా కసాండ్రా 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించింది. చిన్న వయసులోనే కెమెరా ముందు కనిపించిన ఆమె.. కేవలం తొమ్మిదేళ్ల వయసులోనే పిల్లల టీవీ కార్యక్రమానికి యాంకర్‌గా వ్యవహరించింది. తన చలాకీ మాటలు, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో అప్పట్లోనే ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత నటనపై ఆసక్తితో సినిమాల్లోకి అడుగుపెట్టింది. టీనేజ్‌లోనే తమిళ చిత్రంలో కీలక పాత్ర పోషించి వెండితెరపై తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత హీరోయిన్‌గా అవకాశాలు అందుకుంటూ దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ గుర్తింపు సంపాదించుకుంది. 2012లో వచ్చిన 'శివ మనసులో శ్రుతి' సినిమాతో రెజీనా తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయమైంది. ఈ చిత్రంలో తన సహజమైన నటనతో ఆకట్టుకున్న ఆమెకు మంచి గుర్తింపు లభించింది. అంతేకాదు, ఈ సినిమాతోనే సైమా ఉత్తమ తొలి నటి అవార్డును కూడా అందుకుంది. ఆ తర్వాత రెజీనా తెలుగులో

# శ్రీకాంత్, ఊహల ప్రేమకథ ఎలా మొదలయ్యిందో తెలుసా..



నటుడు శ్రీకాంత్ మేక, తన వ్యక్తిగత జీవితం, సినీ ప్రస్థానంపై గతంలో ఓ ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ప్రేమ, పెళ్లి గురించి మాట్లాడుతూ, ప్రేమకు నిర్వచనం అండర్‌స్టాండింగ్ అని స్పష్టం చేశారు. కేవలం ఆకర్షణతో కూడిన ప్రేమ శాశ్వతం కాదని, నమ్మకం, పరస్పర అవగాహన బంధాన్ని బలపరుస్తాయని ఆయన వివరించారు. తన సతీమణి ఊహతో ప్రేమ వివాహం చేసుకోవడానికి గల కారణాలను పంచుకున్నారు. ఇద్దరూ కలిసి నాలుగు సినిమాలు చేయగా, ఊహ మెంటాలిటీ, ఆమె సాఫ్ట్ నేచర్ తనకు బాగా నచ్చాయని, తనలో కనిపించిన ఆ లక్షణాలే ఆమె పట్ల ప్రేమకు దారితీశాయని చెప్పారు. శ్రీకాంత్ తన వంటల అభిరుచి గురించి మాట్లాడారు. అప్పుడప్పుడు ఇంట్లో వంటగదిలోకి వెళుతారా అని అడగ్గా, ఇంట్లో కాదు కానీ, తన స్వగ్రామం కర్ణాటకలోని గంగావతిలో స్నేహితులతో కలిసి వంటలు చేస్తుంటానని తెలిపారు. అక్కడ తమకు ఒక హౌస్ ఉందని, స్నేహితులతో వెళ్లినప్పుడు బయట నుంచి తెప్పించుకోవడం కాకుండా, స్వయంగా వంట కార్యక్రమాలు పెట్టుకుంటామని చెప్పారు. పప్పుచారు, చికెన్ వంటివి కూడా వండుతానని, తన భార్య ఊహకు ఫోన్ చేసి వంట పద్ధతులు కనుక్కుంటానని సరదాగా వెల్లడించారు.తన సినీ కెరీర్ గురించి మాట్లాడుతూ, తనకు బాగా నచ్చిన దర్శకులలో కె. రాఘవేంద్ర రావు, కృష్ణవంశీ ముందుంటారని చెప్పారు. ఈవీవీ సత్యనారాయణ, కృష్ణారెడ్డి, విశ్వనాథ్ అందరూ ఇష్టమే అయినా, కృష్ణవంశీతో తనకు ఎక్కువ ఫ్రెండ్షిప్ ఉందని, "ఒరే ఒరే" అనుకునేంత చనువు

# మహేష్ బాబు వారణాసిలో మరో సర్‌ప్రైజ్..



సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న వారణాసిపై రోజురోజుకూ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవలం తెలుగు ప్రేక్షకుల కోసమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్నారు. అందుకే ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కూడా సోషల్ మీడియాలో విపరీతమైన ఆసక్తిని క్రియేట్ చేస్తోంది. రాజమౌళి గత చిత్రాలైన బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. అయితే వారణాసి విషయంలో మాత్రం ఆయన మరింత భారీగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. కథ, విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు, ప్రపంచ నిర్మాణం ఇలా ప్రతి అంశంలోనూ కొత్త అనుభూతిని అందించేలా సినిమాను తీర్చిదిద్దుతున్నారని టాక్. ఇక తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. వారణాసిలోని కొన్ని కీలక సన్నివేశాల కోసం ప్రత్యేకమైన భాషను, లిపిని రూపొందించినట్లు సమాచారం.కథలోని ఒక ప్రత్యేక ప్రపంచాన్ని మరింత సహజంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగించేలా చూపించేందుకు ఈ కొత్త భాషను ఉపయోగించనున్నారనే ప్రచారం జరుగుతోంది. రాజమౌళి గతంలో బాహుబలి కోసం కిలికి అనే ప్రత్యేక భాషను సృష్టించిన విషయం తెలిసిందే. సినిమాలోని కల్పిత ప్రపంచానికి తగ్గట్టుగా ఆ భాషను రూపొందించడం అప్పట్లో ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగించింది. ఇప్పుడు వారణాసి కోసం కూడా అలాంటి ప్రయోగమే చేస్తున్నారనే వార్త సినిమాపై క్యూరియాసిటీని మరింత పెంచుతోంది.

# ఒకప్పుడు ఊపేసింది.. ఇప్పుడు సినిమాలకు దూరంగా



సి ని వ రా

ఇండస్ట్రీలో హీరోయిన్ గా నిలదొక్కుకోవడం అంత సులభమైన విషయం కాదు. అందం, అభినయం, టాలెంట్ ఉన్నా.. సరైన సమయంలో మంచి అవకాశాలు రావడం కూడా చాలా ముఖ్యం. అందుకే ఒకప్పుడు వరుస సినిమాలతో సందడి చేసిన చాలామంది హీరోయిన్లు.. ఆ తర్వాత క్రమంగా ఇండస్ట్రీకి దూరమైపోయారు. కొందరు పూర్తిగా కనుమరుగైపోగా.. మరికొందరు సోషల్ మీడియా ద్వారా తమ అభిమానులకు టచ్‌లో ఉంటున్నారు. అలాంటి హీరోయిన్ల జాబితాలో పూనమ్ బజ్వా కూడా ఒకరు. ఒకప్పుడు తన క్యూట్ లుక్, చక్కని చిరునవ్వు, గ్లామర్‌తో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ భామ..ప్రస్తుతం సినిమాల్లో పెద్దగా కనిపించడం లేదు. అయితే సోషల్ మీడియాలో మాత్రం అప్పుడప్పుడూ తన లేటెస్ట్ ఫొటోలు, వీడియోలను షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తోంది. పూనమ్ బజ్వా తెలుగు చిత్ర పరిశ్రమలోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది హీరో నవదీప్ నటించిన సినిమాతో. ఆ తర్వాత 'ప్రేమంటే ఇంతే' చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. తన అందం, స్క్రీన్ ప్రెజెన్స్‌తో అప్పట్లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత వచ్చిన 'బాస్' సినిమాలో నాగార్జునతో కలిసి కనిపించింది.ప్రస్తుతం సినిమాల్లో పెద్దగా కనిపించడం లేదు. అయితే సోషల్ మీడియాలో మాత్రం

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224